పేజీలు :12
వెల :5/-

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

# మీడియా టుడే

మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 | సంచిక : 154 | గురువారం 19-3-2026 | పేజీలు 12 | వెల 5/-

## ఈవీ కారు చార్జింగ్ పాయింట్ పేలుడు

**చార్జింగ్ పెట్టిన భవనానికి వ్యాపించిన మంటలు**

**ఇండోర్‌లో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి**

**ఢిల్లీలో షార్ట్‌సర్క్యూట్‌తో భవనంలో అగ్నిప్రమాదం**

**అగ్నికి ఆహుతైన 9 మంది కుటుంబ సభ్యులు**



**న్యూఢిల్లీ/ఇండోర్, మార్చి 18: మీడియా టుడే**
ఢిల్లీలో, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బుధవారం వేర్వేరు అగ్నిప్రమాదాలు చోటుచేసుకొని రెండు కుటుంబాలకు చెందిన 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇండోర్‌లోని బ్రజేశ్వరి అనెక్స్ కాలనీలో ఓ మూడంతస్తుల భవనం బయట ఎలక్ట్రిక్ (ఈవీ) కారుకు చార్జింగ్ పెట్టగా.. బుధవారం తెల్లవారు జామున 3.30 గంటలకు చార్జింగ్ పాయింట్ వద్ద పేలుడు సంభవించింది. దీంతో క్షణాల్లో భవనం మొత్తానికి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో భవనంలోని వారంతా గాఢ నిద్రలో ఉండగా.. ఇంట్లోని గ్యాస్ సిలిండర్లకు మంటలు అంటుకుని మరింతగా వ్యాపించాయి. సమాచారాన్ని అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినా.. అగ్ని ప్రమాదం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇంటి తలుపులకు అమర్చిన ఎలక్ట్రానిక్ తాళాలను తెరవడం క్లిష్టంగా మారింది. తలుపులు పగలగొట్టేటప్పటికే ఇంట్లోని ఇద్దరు మైనర్ బాలలు, ముగ్గురు మహిళలు సహా ఎనిమిది మంది కుటుంబసభ్యులు అగ్నికి ఆహుతయ్యారు. మరో ఇద్దరిని పోలీసులు రక్షించగా.. గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఢిల్లీలోని పాళం ప్రాంతంలో ఓ భవనంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి ఒకే కుటుంబానికి చెందిన 9మంది మరణించారు. రాజేందర్ అనే వ్యాపారికి చెందిన భవనంలో బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, ఒకటో ఫ్లోర్‌లో బట్టలు, కాస్మెటిక్ షోరూమ్‌లు నిర్వహిస్తుండగా.. రెండో, మూడో ఫ్లోర్‌లో ఆయన ఐదుగురు కుమారులు, నలుగురు కోడళ్లు, కుమార్తె, ఏడుగురు మనవలు, మనవరాళ్లతో నివాసముంటున్నారు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లోని షోరూంలో కాస్మెటిక్స్ ఉన్న కారణంగా మంటలు మరింతగా పెరిగి భవనంలోని అన్ని అంతస్తులకూ వ్యాపించాయి. దీంతో ఆ సమయంలో భవనంలో ఉన్న రాజేందర్ భార్య లాదో (70) సహా ఆమె ఇద్దరు కుమారులు, ఇద్దరు కోడళు ్లు, కుమార్తె ముగ్గురు మనవరాళ్లు మంటల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయారు. మరో కుమారుడు తన రెండేళ్ల కూతురిని రెండో ఫ్లోర్ నుంచి కిందికి విసిరేసి తాను కూడా దూకేశాడు.

# బీఆర్ఎస్ బరితెగింపు

## అధికారం పోయినా.. అహంకారం తగ్గలేదు



**కొత్త గవర్నర్‌కు ప్రతిపక్ష నేత శుభాకాంక్షలు చెబుతారనుకున్నా**

**తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకూ వస్తారని అనుకున్నాం..**

**ఆయన సభకే రాలేదు.. రూ.1.06 కోట్ల వేతనం తీసుకున్నారు**

**ప్రజల ఆశీర్వాదంతో వచ్చాను.. వారు నా కాలిగోటికి చాలరు**

**మా విజన్ బీఆర్ఎస్‌కు పాయిజన్.. మాపై విషం కక్కుతున్నారు**

**హార్డ్‌వర్కర్‌ను.. కష్టపడతా.. నేర్చుకుంటా.. పదిమందికి చెబుతా**

**కేసీఆర్ ఇచ్చింది చిప్ప.. రూ.8.11 లక్షల కోట్ల అప్పులు**

**అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**

**20న రాష్ట్ర మంత్రివర్గం భేటీ.. అదే రోజు సభలో బడ్జెట్**

**హైదరాబాద్, మార్చి 18 మీడియా టుడే**
బీఆర్ఎస్ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారని, అధికారం పోయినా.. అహంకారం మాత్రం తగ్గలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఓడించి పక్కన కూర్చోబెట్టినా నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైజింగ్‌ను వెకిలి చేస్తున్నవారికి.. రావణాసురుడికి పట్టిన గతే పడుతుందన్నారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి అని తెలిపారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడానికి అవసరమైన విశిష్ఠ ప్రణాళిక అని పేర్కొన్నారు. గొప్ప సంకల్పాన్ని ప్రజల ముందుంచిన గవర్నర్‌కు సీఎం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత అనుభవాలను, రాష్ట్ర పరిస్థితులను, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన పాలసీ డాక్యుమెంట్‌ను ప్రజల ముందు పెట్టామని రేవంత్ తెలిపారు.

> నేను హార్డ్‌వర్కర్‌ని. కష్టపడతా.. నేర్చుకుంటా.. నేర్చుకున్న దానిని పది మందికి చెబుతా. గతంలో ఒకరిలా విజనరీ అనో, ఉద్యమకారుడిననో చెప్పుకోను. 2029లో కూడా ఈ ప్రభుత్వమే వస్తుంది. ఈ నాయకత్వమే, ఈ మంత్రివర్గమే కొనసాగుతుంది. మాతోనే తెలంగాణ సుభిక్షమని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందని, పరిశ్రమలు వస్తాయని, వ్యవసాయం లాభసాటిగా మారుతుందని ప్రజలు నమ్ముతున్నారు.
>
> **- సీఎం రేవంత్‌రెడ్డి**

ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీర్వాదంతో 2034 వరకూ ఇదే మంత్రి వర్గం అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, పరిశ్రమలు వస్తాయని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని రేవంత్ భరోసా ఇచ్చారు.

**గొప్ప భవిష్యత్తు కోసం పాలసీ డాక్యుమెంట్..**
ప్రపంచవ్యాప్తంగా ఏఐ సునామీ వస్తోందని.. కృత్రిమ మేధ వల్ల కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోతారని, తీవ్రమైన నిరుద్యోగ సమస్య తలెత్తే ప్రమాదం ఉందని ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని సీఎం గుర్తుచేశారు. "ఈ పరిస్థితిలో తెలంగాణ భవిష్యత్తు తరాల కోసం ప్రణాళికలు రచించాల్సిన అవసరం ఉందా? లేదా? మనం బలమైన శక్తిగా ఎదగాలనే ఆలోచననే.. గవర్నర్ ప్రసంగం ద్వారా తెలంగాణ పాలసీని ప్రవేశ పెట్టాం" అని పేర్కొన్నారు. రాష్ట్రానికి గొప్ప భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతోనే 2047 తెలంగాణ గ్లోబల్ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ తెచ్చామన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా 2023 డిసెంబరు 1 నుంచి కేసీఆర్ తీసుకున్న వేతనం ఒక కోటి ఆరు లక్షల యాభై ఆరు వేల ఆరు వందల డెబ్బై నాలుగు రూపాయలని రేవంత్ సభ సాక్షిగా తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సమయంలో ప్రధాన ప్రతిపక్ష నేత వస్తారనుకున్నామని, కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు చెబుతారని భావించామని, అయినా ఆయన సభకు రాలేదని విమర్శించారు. విధులకు హాజరు కాకుండా జీతభత్యాలు పొందేవారిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు వచ్చి తెలంగాణ అభివృద్ధికి సలహాలు, సూచనలు చేయాలని కోరారు. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా కొందరిలో రాచరిక పోకడలు పోలేదని వ్యంగ్యంగా అన్నారు.

**కావాలంటే అప్పుడు కూర్చోండి..**
ప్రతిపక్ష సభ్యులకు సీఎం కుర్చీలో కూర్చోవాలనే యావ బాగా ఉందన్న రేవంత్.. కావాలంటే, సభ లేని సమయంలో వచ్చి కూర్చోవచ్చంటూ ఎద్దేవా చేశారు. లేదా, సభ జరిగే సమయంలోనైనా ఏదో ఒక పేపర్ తీసుకుని వచ్చి తన పక్కన కాసేపు కూర్చుని పోవచ్చునని, తాను చాలా లిబరల్‌గా ఉంటానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్నిచూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ఓఆర్ఆర్ లీజును రద్దు చేస్తామని,

మిగతా 3లో...

## మొదటి విడతలోనే ప్రతి రైతుకూ భరోసా!

**70 లక్షల మంది ఖాతాలకు ఒకే రోజు నగదు బదిలీ**

**తొలిరోజు ఎకరం విస్తీర్ణం వరకు డబ్బుల చెల్లింపు.. ఐదెకరాలు పదెకరాలున్నా ఎకరానికి సాయం**

**హైదరాబాద్, మార్చి 18 మీడియా టుడే**
రైతు భరోసా పథకాన్ని గతానికి భిన్నంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒక రోజు ఎకరం వరకు, రెండోరోజు రెండెకరాలకు, మూడో రోజు మూడెకరాలకు... ఇలా ఆరోహణ పద్ధతిలో కాకుండా ప్రతి రైతుకు మొదటి రోజే పెట్టుబడి సాయం అందేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 22న విడుదలచేసే మొదటి విడతలో ఒకే రోజు 70 లక్షల మందికి రైతు భరోసా చెల్లిస్తారు. అంటే.. మొదటి రోజు ఎకరం విస్తీర్ణం వరకు నగదు బదిలీచేస్తారు. అంటే ఒక రైతుకు రెండెకరాలుంటే.. తొలి విడతలో ఒక ఎకరానికి రైతు భరోసా అందుతుంది. ఐదెకరాలున్నా, పదెకరాలున్నా.. ఒక ఎకరానికి రూ.6 వేలు తొలిరోజు రైతు భరోసా అందుతుంది. ఒక వేళ ఎకరం కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు... ఎంత భూమి ఉంటే ఆ లెక్క ప్రకారం రైతు భరోసా చెల్లిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. అంటే... రైతు భరోసా ఎన్ని విడతలుగా విడుదల చేసినా ప్రతిసారి అందరికీ ఎంతో కొంత ఆర్థికసాయం అందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. యాసంగి రైతు భరోసాను ఈనెల 22న ప్రారంభిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే! మొదటి విడతగా ఈ నెల 22న ఒక ఎకరం వరకు రైతు భరోసా చెల్లిస్తామని, మూడు వారాల తర్వాత మళ్లీ ఏప్రిల్‌లో రెండో విడత, ఏప్రిల్ నెలాఖరు నాటికి మూడో విడతలో మొత్తం చెల్లింపులు చేస్తామని షెడ్యూలు ప్రకటించింది. మొదటి రోజు ఒక ఎకరం వరకు చెల్లిస్తామంటే.. సున్న నుంచి ఒక ఎకరంలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే చెల్లించే పరిస్థితి ఇదివరకు ఉండేది. రెండో రోజు రెండెకరాల వరకు చెల్లిస్తామంటే.. ఒక ఎకరం నుంచి రెండెకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే చెల్లించేవారు. రాష్ట్రంలో 73.55 లక్షల మంది రైతులు(పట్టాదారులు)ఉంటే... సున్న నుంచి 1 ఎకరం భూమి ఉన్న రైతులు 28.58 లక్షల మంది ఉన్నారు.



# మూసీపై.. మాటల మంటలు

## శాసనసభలో వాడీ వేడి చర్చ.. నగరాభివృద్ధి కోసం మూసీ ప్రక్షాళన

**పేదలకు అన్యాయం జరగనివ్వం: దుద్దిళ్ల**

**మూసీ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటం ఇష్టంలేదా?: భట్టి**

**అంచనాలు పెంచారు: కేటీఆర్**

**హైదరాబాద్, మార్చి 18 మీడియా టుడే**
మూసీ ప్రక్షాళన అంశం శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల మంటలు రేపింది. బుధవారం ఈ అంశంపై సభలో వాడీవేడి చర్చ జరిగింది. మూసీ ప్రక్షాళన, వ్యయం, పేదల పునరావాసం, ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్న లు వేయగా.. నగరాభివృద్ధి కోసం ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమైనదని ప్రభుత్వం పేర్కొంది. అయితే సర్కారు వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ సభ్యులు చివరకు సభనుంచి వాకౌట్ చేశారు. తొలుత ఆ పార్టీ సభ్యుడు కేటీఆర్ చర్చలో పాల్గొని పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు వ్యయం రూ.లక్షన్నర కోట్లు అని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో చెప్పారని, ఇప్పుడు రూ.ఆరేడు వేల కోట్లతో పూర్తవుతుందని చెబుతున్నారని, ఇందులో ఏది నిజమని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు సంబంధించి కనీసం డీపీఆర్ కూడా సిద్ధం కాకుండానే ఇళ్లను ఎలా కూలుస్తారని నిలదీశారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంలో చెప్పారని, ఇప్పుడు రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు. అలాగే ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) నుంచి రుణం మంజూరైనట్లు ప్రభుత్వం చెబుతుంటే.. ఈ నెల 11న ఏడీబీ రాసిన లేఖలో కనీసం డీపీఆర్ కూడా అందలేదని పేర్కొన్న విషయాన్ని కేటీఆర్ సభ దృష్టి కి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ.. మూసీ ప్రక్షాళన కేవలం సౌందర్యం కోసం కాదని, హైదరాబాద్ భవిష్యత్తు కోసంచేస్తున్న సాహసోపేత కార్యక్రమమని అన్నారు. గతప్రభుత్వ హయాంలో మూసీ పరివాహక ప్రాంతం మురికికూపంగా మారిందని, ఆక్రమణల వల్ల నగరం మునిగిపోయే పరిస్థితి వచ్చిందని ఆయన తెలిపారు.



**ప్రతి పైసాకూ లెక్క..**
ప్రాజెక్టులో పూర్తి పారదర్శకత పాటిస్తామని, ప్రతి పైసాకూ లెక్క ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అవసరమైతే పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మూసీ పునరుద్ధరణను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయబోమని స్పష్టం చేశారు. ప్రతిపక్షం కేవలం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. మెయిన్ హార్ట్ కంపెనీ డిసెంబరు 2024లో డీపీఆర్ వర్క్ మొదలుపెట్టిందని, ఈ ఏడాది ఫిబ్రవరిలో సమర్పించిందని వెల్లడించారు. అవసరమైతే ఆ నివేదికను సభలో ప్రవేశపెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 2016లో బఫర్ జోన్‌కు ఇరువైపులా 50 మీటర్లు ఉండాలని తెచ్చిన జీవో ప్రకారమే తాము నడుచుకుంటామని తెలిపారు. ఏడీబీ రుణం విషయంలో వచ్చే బోర్డు మీటింగ్‌లో స్పష్టత వస్తుందని, వాళ్లు సంతృప్తిగా లేకపోతే వేరే సంస్థ ద్వారా చేపడతామన్నారు.

## పశ్చిమాసియాలో 'చమురు' మంటలు!

**ఇరాన్ నేతలు, ఉన్నతాధికారులు లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రత్యేక ఆపరేషన్**

**ఇరాన్ మంత్రి ఎస్మాయిల్ ఖాతిబ్ మృతి**

**సౌదీ, యూఏఈ, ఖతార్‌లలోని ఐదు భారీ పెట్రోకెమికల్, గ్యాస్ ఫీల్డ్‌లపై ఇరాన్ ప్రతీకార దాడులు**



**వాషింగ్టన్, మార్చి 18: మీడియా టుడే**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింతగా ఎగిసిపడుతున్నాయి. ఇరాన్‌కు చెందిన సౌత్ ఫార్స్ సహజవాయు రిఫైనరీపై, బుషెహర్ అణువిద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. నేతలు–ఉన్నతాధికారులు లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్‌తో ఇరాన్ మంత్రిని చంపేసింది. అమెరికా కూడా ఖేష్మ్ దీవిపై బంకర్ బస్టర్ బాంబులతో విరుచుకుపడింది. ఈ పరిణామాలతో తీవ్రంగా ఆగ్రహించిన ఇరాన్.. ఇజ్రాయెల్, అరబ్ గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్ల దాడిని ఉధృతం చేసింది. ముఖ్యంగా ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాల్లోని ఐదు కీలకమైన చమురు, గ్యాస్ వ్యవస్థలను లక్ష్యం చేసుకుంటున్నట్టు ప్రకటించింది. దీనితో ఆ దేశాలు అప్రమత్తమయ్యాయి. ఖతార్‌లోని ప్రపంచంలోనే అతిపెద్దదైన సహజవాయువు నిల్వ/రవాణా కేంద్రం రాస్ లఫన్ కాంప్లెక్స్‌పై ఇరాన్ క్షిపణి దాడులతో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. బహ్రెయిన్‌పైనా ఇరాన్ డ్రోన్లతో దాడులు చేసింది. రియాద్, అల్ కర్జ్ ప్రాంతాలపైకి ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు దూసుకువస్తుండటంతో సౌదీ అప్రమత్తత హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిణామాలతో చమురు, గ్యాస్ సరఫరా సమస్య మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం**
బుధవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్, జేరుసలేం, సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని వందకుపైగా లక్ష్యాలపై ఇరాన్ క్లస్టర్ వార్‌హెడ్లు ఉన్న క్షిపణులను ప్రయోగించింది. అవి ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలను ఛేదించుకుని, పలు ప్రాంతాల్లో పేలుళ్లు సృష్టించాయి. రమత్‌గన్ ప్రాంతంలో ఇద్దరు మృతిచెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. చాలా చోట్ల ఇళ్లు, భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. మరోవైపు, ఇరాన్ క్షిపణి దాడులతో ఇజ్రాయెల్‌లోని బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మూడు ప్రైవేటుఖతార్, కువైట్,

మిగతా 3లో...

# స్వయంభు శ్రీ గుండుమల్లన్న స్వామి ఉగాది జాతర ఉత్సవాలు




**జగిత్యాల జిల్లా మార్చి18 న్యూస్ మీడియా టుడే గొల్లపల్లి మండలం ( సట్టా రాజశేఖర్ ) రిపోర్టర్**

తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని తిరుమలాపురం (పిడి) గ్రామంలో గల స్వయంభు శ్రీ గుండు మల్లన్న స్వామి వారి ఉగాది ఉత్సాహాలు ఆలయంలో నేటి నుంచి జరుగు జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడును. ఈనెల 18న బుధవారం నుండి 20న శుక్రవారం వరకు మూడు రోజులపాటు జరుగు జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు ఉదయం 8 గంటల నుండి స్వామివారి ఉత్సవ మూర్తులతో శోభయాత్ర,మధ్యాహ్నం ఎడ్లబండ్ల పోటీలు,ఎడ్ల బండ్ల పోటీలో గెలుపొందిన వారికి. మొదటి బహుమతి రూ. 21116, రెండవ బహుమతి రూ. 11116, మూడవ బహుమతి రూ. 6116, దాతలు అందజేయగలరని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. 19న ఉదయం స్వామివారి గోదావరి స్నానం, పచ్చని పందిరి, ప్రత్యేక పూజలు. సాయంత్రం ఎడ్లబండ్ల శోభయాత్ర. సాయంత్రం ఒగ్గు కథ కాలక్షేపం. 20న ప్రత్యేక పూజలు, శ్రీ గుండుమలన్న స్వామి,వారి పట్నాలు బోనాలు. మధ్యాహ్నం మహా అన్నప్రాసన .సాయంత్రం,అగ్ని గుండాల కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగును. ఈ సందర్భంగా మండలంలోని భక్తులు,అధిక సంఖ్యలో పాల్గొని,స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని. ఆలయ కమిటీ అధ్యక్షులు ఉస్కేమల్ల లచ్చయ్య ,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు తెలిపారు.

# యువత మత్తుకు దూరంగా అభివృద్ధికి దగ్గరగా ఉండాలి

**సర్పంచ్ ఫోన్ శెట్టి మహేష్ జాబితాపూర్**

**ధర్మారం జాబితాపూర్ గ్రామంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' అవగాహన సదస్సు**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి మార్చి 18, మీడియా టుడే:( సట్టా రాజశేఖర్)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లిలో భాగంగా జగిత్యాల రూరల్ మండల పరిధిలోని ధర్మారం జాబితాపూర్ గ్రామంలో కళాకారులచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మహేష్ యువతను ఉద్దేశించి ప్రసంగిస్తూ కీలక సూచనలు చేశారు.

**డ్రగ్స్ రహిత గ్రామమే లక్ష్యం**

సర్పంచ్ మహేష్ మాట్లాడుతూ, నేటి యువత దేశానికి వెన్నెముక అని, అటువంటి యువశక్తి మత్తు పదార్థాల బారిన పడి నిర్వీర్యం కాకూడదని హితవు పలికారు.

**డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి**

యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అన్నారు.

**బాధ్యతాయుత ప్రవర్తన:**

యువత బాధ్యతారాహిత్యాన్ని వీడి, గ్రామ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

**స్వచ్ఛ గ్రామం:**

పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించి, మన గ్రామాన్ని 'స్వచ్ఛ గ్రామంగా' తీర్చిదిద్దేందుకు తోడ్పడాలని కోరారు.

**99 రోజుల ప్రగతి ప్రణాళిక**



?ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తున్నామని సర్పంచ్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో. గ్రామ సర్పంచ్ మహేష్ గారు. ఉప సర్పంచ్ మరుశెట్టి లక్ష్మణ్ గారు. పంచాయతీ సెక్రెటరీ రంజిత్ గారు. గ్రామపంచాయతీ పాలకవర్గం. సభ్యులు. గ్రామ ప్రజలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే.కళాకారులు తమ ఆటపాటల ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు కళ్లకు కట్టినట్లు వివరించాంమీడియా టుడే జాబితాపూర్

# ప్రాణాలు పోయిన పట్టించుకోరా

**పులి సంచారంతో భయం గుప్పిట్లో ప్రజలు, రైతులు - పులిని బంధించి సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని**

**అడిషనల్ కలెక్టర్ కీ వినతి పత్రం అందజేసిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్-జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత**



**జగిత్యాల మీడియా టుడే-మార్చు 18**

జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కోడిమ్యాల మండలం గంగారాం తండాలో పులి భయం ఉద్ధృతమవుతుండగా, అటవీ అధికారుల నిర్లక్ష్యంపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేసారు.

పురిని అటవీశాఖ అధికారులు వెంటనే బంధించి సురక్షితమైన ప్రాంతం తరలించాలని,బుధవారం జగిత్యాల జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ దావ వసంత, టిఆర్ఎస్ నాయకులతో కలిసి జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ గారికి వినతి పత్రం ఇచ్చారు. గత ఏడాది కాలంగా చొప్పదండి నియోజకవర్గం లోని కొడిమ్యాల మండలం,సిరిసిల్ల సిద్ధిపేట భువనగిరి ప్రాంతాలలో, సంచరిస్తూ, సుమారు 20 దాకా పశువులను చంపి తిని, గత నాలుగు రోజులుగా కొడిమ్యాల ప్రాంతంలో తిరుగుతూ పశువులపై దాడులు చేస్తున్న పులి, మృతి చెందిన ఆవును తినడానికి వరుసగా రెండు రోజులుగా వస్తున్నప్పటికీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని సుంకె తీవ్రంగా మండిపడ్డారు. సీసీ కెమెరాల్లో పులి కదలికలు స్పష్టంగా రికార్డు అయినా, పులి సంచారం నిర్ధారణ అయినా కూడా అధికారులు కేవలం నామమాత్రపు హాజరు చూపుతూ వెళ్లిపోతున్నారని, "అటు వెళ్లకండి" అంటూ హెచ్చరించడం తప్ప భద్రతా చర్యలు ఏవీ కనిపించడం లేదని, విమర్శించారు. మృతి చెందిన ఆవులను ఎక్కడివి అక్కడే వదిలేయడం మరింత ప్రమాదకర పరిస్థితికి దారితీస్తోందని అయన ఆందోళన వ్యక్తం చేసారు. అవి కుళ్లిపోవడం వల్ల ఇన్ఫెక్షన్లు వ్యాపించే అవకాశం ఉండటంతో పాటు, కుక్కలు వాటిని తిని గ్రామంలోకి వస్తే వ్యాధులు ప్రబలే ముప్పు ఉందని హెచ్చరించారు. ఇక ఒకవైపు నీటి సమస్య, మరోవైపు పులి భయం కారణంగా రైతులు తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని,పంటలకు నీరు పెట్టలేక పంటలు ఎండిపోతుండటంతో ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా నామమాత్రపు చర్యలు మానుకుని పులిని వెంటనే పట్టుకుని ఈ ప్రాంతానికి పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో లికొడిమ్యాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు.. పులి వెంకటేష్ గౌడ్. జగిత్యాల పట్టణ బి ఆర్ యస్ అధ్యక్షులు ఆయిల్నేని వెంకటేశ్వర్ రావు,యూత్ అధ్యక్షులు గడ్డం లక్ష్మారెడ్డి, నాయకులు కొత్తూరి స్వామి, పవన్,నజీర్, ఆదిమల్లు, అజ్జు తదితరులు పాల్గొన్నారు

# డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడిన 49 మందికి జరిమానాలు

**మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, తస్మాత్ జాగ్రత్త**

**వేములవాడ పట్టణ ఇన్ స్పెక్టర్ వీరప్రసాద్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 18 :**



వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ఐపీఎస్ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 49 మంది మద్యం సేవించి పట్టుబడగా వారిని వేములవాడ పోలీసులు బుధవారం రోజు కోర్టులో ప్రవేశపెట్టగా 35 మందికి 2000 రూపాయల జరిమాన,14 మందికి 4000 రూపాయల జరిమానాలు విధిస్తు వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్ స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లోపట్టుబడిన మందు బాబులకు పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్.ఐ రాజు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా సి.ఐ వీర ప్రసాద్ మాట్లాడుతూ...ప్రతి రోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్స్ లింగ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశలకు పోలీస్ విచారణ సమయంలో ఇబ్బందులు కలుగుతాయని, ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# అబ్బాపూర్ గ్రామంలో ప్రజా బాట కార్యక్రమం




**మీడియా టుడే జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం (సట్టా రాజశేఖర్) రిపోర్టర్**

చిల్వకోడూర్ సెక్షన్ పరిధిలోని అబ్బాపూర్ గ్రామంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్య క్రమం లో ఓవర్ లోడ్ ఉన్న డిటిఆర్ పై అదనంగా నూతన 63 కెవిఏ అమర్చి ప్రారంభించారు. అలాగే ఇండ్ల మీదుగా ఉన్న లైన్ ను మార్చి వేయడం జరిగింది. ఇండ్ల పైన ఉండే లైన్ మార్చే పనులకు గాను 2 లక్షలు మరియు నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు 4 లక్షలు అంచనా వ్యయాలు కాగా గౌరవ ఎస్సీ, ఎస్టీ మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సహకారం అందించారు. అదనంగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుతో ఇటు రైతులకు మరియు ఎన్నో ఏండ్ల నుండి ఉన్న సమస్య ,ఇండ్ల పై వైర్లను తొలగించినందుకు వినియోగ దారులు హర్షం వ్యక్తం చేశారు. ఇట్టి పనులకు పూర్తి కావడానికి కృషి చేసిన విద్యుత్ శాఖ వారికి గ్రామ ప్రజలు మరియు పాలక వర్గం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఏఈ రాకేష్ కుమార్ సబ్ ఇంజనీర్ మహేష్, గ్రామ సర్పంచ్ చిట్యాల సౌందర్య ,ఉప సర్పంచ్ చెవుల తిరుపతి ఎల్ఎం రమేష్ ఏఎల్ఎం శ్రీకాంత్ మరియు గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డిని బిజెపిలోకి తీసుకువచ్చేందుకు ఎంపీ అరవింద్ ప్రయత్నాలు




**జగిత్యాల మీడియా టుడే- మార్చి 18**

త్వరలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన జీవన్ రెడ్డి , తదుపరి ఏ పార్టీలో చేరు తారనే అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి , జీవన్ రెడ్డిని భారతీయ జనతా పార్టీలో తీసుకునేలా చురుకుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. పార్టీ బలోపేతం దృష్ట్యా జీవన్ రెడ్డి చేరికపై ముందడుగు వేయాలని ఆయన భావిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు లతో ఎంపీ అర్వింద్ సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. జీవన్ రెడ్డితో చర్చలు జరిపి పార్టీలోకి ఆహ్వానించాలనే విషయాన్ని వారితో పంచుకున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు కీలక నాయకులను ఆకర్షించే దిశగా బీజేపీ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, జీవన్ రెడ్డి చేరిక అంశంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఎండుతున్న పంటలు కాలువల్లోనే రైతుల నిరసన

**పూర్తిస్థాయిలో సాగునీరు అందించి పంట పొలాలను కాపాడాలి**



**కోదాడ, మార్చి 18 (మీడియా టుడే)-:**

సాగునీరు అందక చివరి భూముల్లో పంట పొలాలు నిలువునా ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు, నల్లబండగూడెం,ద్వారకుంట, రెడ్లకుంట గ్రామాల రైతులు ఆర్కే మేజర్ కాలువల్లోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 15 రోజులకు ఒకసారి వంతుల వారీగా నీరు విడుదల చేస్తున్నారని, అయితే ఆ నీరు చివరి ఆయకట్టు వరకు చేరడం లేదని వాపోయారు. మొన్నటి వరకు యూరియా కొరకు అనేక కష్టాలు పడి పంటలు పండిస్తే తీరా పంట చేతికి వచ్చే తరుణంలో ఎండిపోతుంటే దిక్కుతోచడం లేదని రైతులు వాపోయారు. పెట్టిన పెట్టుబడి కూడా దక్కేలా లేదని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లినా తమను పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసి తమ పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు గ్రామాల రైతులు జాల శ్రీనివాస్, జాల వెంకన్న, గోపి, తిరపయ్య, ముత్తయ్య, మహేష్, కార్తీక్, సోమయ్య, నగేష్, రాంబాబు, శంకర్, నాగేశ్వరరావు, వేణు, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# జగన్.. నీ మనస్సాక్షిని అడుగు

**సునీత బాధితురాలా? కాదా?'అన్న' అనే పదానికి జగన్ కళంకం: షర్మిల**

**'కడప ఎంపీ' కేంద్రంగానే వివేకా హత్య : షర్మిల**

**విశాఖపట్నం, మార్చి 18:**
"జగన్.. నీ మనస్సాక్షిని అడుగు. సునీత బాధితురాలా..? కాదా..?" అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్‌ను ఉద్దేశించి నిలదీశారు. కడప పార్లమెంటు సీటు కేంద్రంగానే మాజీ మంత్రి, తమ బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిందని చెప్పారు. "వివేకా హత్యపై ప్రజలను గందరగోళానికి గురిచేయడమే జగన్ సిద్ధాంతంగా కనిపిస్తోంది. వివేకా హత్య ముమ్మాటికీ కడప ఎంపీ సీటు కేంద్రంగానే జరిగింది. చిన్నాన్న ఈ విషయమై నా వద్దకు వచ్చి రెండు గంటలపాటు చర్చించారు. అవినాశ్ రెడ్డికి కడప ఎంపీ సీటు కరెక్ట్ కాదని ఆయన గట్టిగా నమ్మారు. ఇదే విషయాన్ని జగన్‌తోపాటు అందరికీ చెప్పారు. అయినా.. జగన్ అవినాశ్‌రెడ్డికే టికెట్ ఇచ్చారు." అని షర్మిల తెలిపారు. జగన్ మాటను గౌరవించి 2019 ఎన్నికల్లో అవినాశ్ గెలుపు కోసం వివేకా కృషి చేశారని చెప్పారు. అయితే, వివేకానందరెడ్డి తమకు ఎప్పటికైనా అడ్డంకేనని.. అవినాశ్, ఆయన తండ్రికి అర్థం కావడంతోనే ఈ హత్య జరిగిందన్నారు. "ఇవేమీ తెలియనట్టు, నిజం కానట్టు.. ఇప్పుడు వివేకా కుమార్తె సునీత భర్త హత్య చేయించాడంటూ అవినాశ్‌రెడ్డి మాట్లాడడం దారుణం. ఈ వ్యాఖ్యలు సునీత, ఆమె భర్తపై నెపాన్ని నెట్టే ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి. సునీతకు ప్రాణ హాని ఉందని తెలిసినా ధైర్యంగా పోరాటం చేస్తోంది. అన్నగా జగన్‌కు వీసమెత్తయినా కనికరం లేదు. నీ మనస్సాక్షిని అడుగు. సునీత బాధితురాలా?, కాదా?." అని షర్మిల నిలదీశారు. బుధవారం విశాఖ ఎయిర్‌పోర్టులో మీడియాతో ఆమె మాట్లాడారు. షర్మిల ఇంకా ఏమన్నారంటే..

### సొంత మీడియా అహంకారం
వివేకా గుండెపోటుతో చనిపోయారన్న థియరీని సృష్టించింది సునీత అంటూ అవినాశ్ మాట్లాడుతున్నారు. కానీ, వాస్తవంగా వివేకా చనిపోయిన రోజు సునీత హైదరాబాద్‌లో ఉన్నారు. అదేరోజు ఉదయం 7 గంటల నుంచి గుండెపోటుతో చనిపోయినట్టు జగన్ మీడియాలో ప్రసారం చేశారు. మేమంతా అప్పుడు హైదరాబాద్‌లో ఉన్నాం. ఈ వార్త విని షాక్‌కు గురయ్యాం. జగన్ సొంత చానెల్‌లో గుండెపోటుతో చనిపోయినట్టు చూపించారు. లోకల్ న్యూస్ ఇచ్చే అవకాశం అక్కడే ఉన్న అవినాశ్‌కు ఉంటుందా? హైదరాబాద్‌లో ఉన్న సునీతకు ఉంటుందా?. రక్తపు మడుగులో పడి ఉన్న వివేకానందరెడ్డిని చూసిన ఎవరికైనా గుండెపోటు కాదని అర్థమవుతుంది. ఇది స్థానికంగా ఉన్న అవినాశ్ రెడ్డి ప్రభావితం చేసినట్టు కాదా?. అప్పట్లో గుండెపోటు అని ప్రచారం చేసిన దానిపై ఆ మీడియాను నడుపుతున్న భారతీరెడ్డి గానీ, జగన్‌గానీ ఇప్పటి వరకు ఎందుకు సమాధానం చెప్పలేదు.

### తండ్రిలా చూసుకున్నారు!
వివేకాను సునీత భర్త రాజశేఖర్‌రెడ్డి చంపించారన్నట్టుగా మాట్లాడుతున్నారు. అయితే వివేకానందరెడ్డి బావమరిదే రాజశేఖర్‌రెడ్డి. సునీత కంటే ఎక్కువగా వివేకాను ఆయన ప్రేమిస్తారు. అంత సన్నిహితంగా ఉండేవారు. అటువంటి ఆయన్ను ఎందుకు చంపుతారు. వివేకాకు కొడుకులేని లోటును రాజశేఖర్‌రెడ్డి తీర్చారు. అవినాశ్‌ను దోషిగా చూపిస్తే తనను వదిలేసి బీజేపీలోకి వెళ్లిపోతాడని జగన్ చెప్పారు. సీబీఐ విచారణ వేగవంతం చేయాలని సునీత ఎంతో ప్రాధేయపడింది. జగన్ ఒప్పుకోకపోవడంతోనే విభేదించి పోరాటం మొదలు పెట్టింది.

### మీరు న్యాయం చేయనందుకే!
బాధితుల పక్షాన నిలబడకుండా నిందితుల పక్షాన నిలబడ్డారంటే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికి ఉంటే ఎంత బాధపడేవారో అందరికీ తెలుసు, చంద్రబాబును సునీత కలిసిందని ఆరోపణలు చేస్తున్నారు. మీరు న్యాయం చేయలేదు కాబట్టే చంద్రబాబును కలిసిందన్న విషయం తెలియదా?. సీబీఐ విచారణకు అడిగితే వేయలేదు కాబట్టే పోరాటం చేయాల్సి వచ్చింది. వివేకాను ఎవరు చంపించారన్న విషయం జగన్మోహన్‌రెడ్డికి తెలియదా?. ఇలాంటి అన్న ఉంటే శత్రువులు అనవసరం. 'అన్న' అనే పదానికి జగన్ కళంకం. సునీత పోరాటం చేస్తుంటే మీడియా ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం అన్యాయం.

# పశ్చిమాసియాలో..

(మొదటిపేజీ తరువాయి)

యూఏఈ, సౌదీలోని పలు ప్రాంతాలపైకి ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగిస్తూనే ఉంది. రక్షణ వ్యవస్థలు వాటిని అడ్డుకుంటుండటంతో.. వాటి శకలాలు నివాస, వాణిజ్య ప్రాంతాల్లో పడి పేలుళ్లు జరుగుతున్నాయి. దుబాయ్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్, ఎగ్జిబిషన్ సెంటర్ ప్రాంతంలో భారీ పేలుళ్లు జరిగాయి. యూఏఈలోని అల్ మిన్హాద్ ఎయిర్‌బేస్‌లో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు విధ్వంసం సృష్టించాయి. అక్కడి ఆస్ట్రేలియన్ డిఫెన్స్ ఫోర్స్ (ఏడీఎఫ్) వ్యవస్థలకు కొంత నష్టం జరిగిందని ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ వెల్లడించారు. అమెరికా, ఇజ్రాయెల్‌లకు సహకరిస్తున్న 111 మంది ద్రోహులను బుధవారం అరెస్టు చేశామని ఇరాన్ ప్రకటించింది. వారి నుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. ఇరాన్‌కు మద్దతుగా వచ్చిన హెజ్బొల్లా సంస్థను అంతం చేస్తామంటూ దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయెల్.. లెబనాన్‌లో మారణకాండ సృష్టిస్తోంది. బుధవారం లెబనాన్ రాజధాని బీరూట్‌కు సమీపంలోని బశౌరాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 20 మంది ప్రజలు మరణించారు. వందల మంది గాయపడ్డారు. మరోవైపు గాజాపైనా ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఖాన్ యూనిస్ ప్రాంతంలో ఒక పాలస్తీనా జాతీయుడు మరణించారు. ఇరాన్‌లోని దోరుద్ పట్టణంలో ఇజ్రాయెల్ చేసిన దాడిలో ఏడుగురు మృతిచెందినట్టు స్థానిక మీడియా వెల్లడించింది. ఇజ్రాయెల్ బుధవారం తెల్లవారుజామున ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తోపాటు ఇతర కీలక నగరాలపై తీవ్రస్థాయిలో వైమానిక దాడులు చేసింది. ఇరాన్ నేతలు, ఉన్నతాధికారులను లక్ష్యంగా చేసుకుంది. తమ దాడుల్లో ఇరాన్ నిఘా శాఖ మంత్రి ఎస్మాయిల్ ఖాతిబ్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు మృతిచెందినట్టు బుధవారం ప్రకటించింది. తమకు సమాచారం ఇవ్వకుండానే ఇరాన్ ఉన్నతాధికారులను అంతం చేయడం కోసం మిలిటరీకి ప్రధాని నెతన్యాహు, తాను అనుమతి ఇచ్చినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ చెప్పారు. రెండు రోజుల్లోనే ముగ్గురు కీలక నేతలను అంతం చేశామని, ఇకపై ఇలాంటివి ఇంకా ఉంటాయని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ బరితెగింపు...

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైతే అవినీతికి పాల్పడిన వారిని లోపల కూడా వేస్తామని ప్రకటించారు. వార్డు సభ్యుడిగా కూడా గెలవని హరీశ్‌రావు.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సహకారంతోనే మంత్రి అయ్యారని, చంద్రబాబు కాళ్లు పట్టుకుంటే.. కేటీఆర్ సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యే అయ్యారని ఎద్దేవా చేశారు. హరీశ్, కేటీఆర్ ద్రోహులని, తాను ప్రజల ఆశీర్వాదంతో, స్వశక్తితో రాజకీయాల్లో ఎదిగానని.. తట్ట, మట్టి పని చేసి ప్రజల నుంచి వచ్చిన నాయకుడినని గుర్తు చేశారు. వారు తన కాలి గోటికి కూడా సరిపోరన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎంత అడ్డం మాట్లాడితే అన్ని దెబ్బలు పడతాయన్నారు. "బరాబర్ అన్నందుకే.. నెత్తి మీద కాలు పెట్టి తొక్కి ఇక్కడికి వచ్చా.. అల్లాటప్పాగా రాలేదు. బరాబర్ 2029లో కూడా తొక్కకపోతే చూడండి.. బీఆర్ఎస్ నాయకులు అంతా కట్టకట్టుకుని రాండి.. తొక్కకపోతే చూడండి.. ఇదే నా సవాలు.. రాసి పెట్టుకోండి.. ఎలా గెలుస్తారో నేను చూస్తా" అని ఘాటుగా హెచ్చరించారు. వయసుతోపాటు ఓపిక ఉండాలని.. ఓపికఉంటేనే అవకాశాలు వస్తాయని రేవంత్ అన్నారు. కుర్చీ వారసత్వంగా రాదని, ప్రజలు ఆశీర్వదిస్తే వస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా.. ఎవరు అడ్డుపడినా.. ముందుకు వెళ్లాలనే ప్రభుత్వం నిర్ణయించుకుందని సీఎం తేల్చిచెప్పారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ నగరం.. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు నగరాల్లా కాకూడదనే ఉద్దేశంతోనే క్యూర్ ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని నగరంలో ఆక్రమణకు గురైన చెరువులన్నింటినీ కాపాడుతున్నామని, ఇందుకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చెరువుల ఆక్రమణకు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్వోసీలు జారీ చేశారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ మాఫియా ఆక్రమణల్ని తొలగిస్తుంటే కూడా ప్రభుత్వంపై ఆగ్రహిస్తే తాము ఏం చేయాలని ప్రశ్నించారు. మూసీలో బఫర్ జోన్, రివర్ బెడ్‌లో 10 వేల ఆక్రమణలు ఉన్నాయని నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చెప్పిన విషయాలను ప్రస్తావించారు. మూసీ ప్రక్షాళన ద్వారా ప్రపంచ స్థాయి ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసుకుందామని చెబితే విపక్ష నేతలు వినట్లేదన్నారు. గతంలో ఉప్పల్ భగాయత్‌లో వారు చేసిన అభివృద్ధిపై నిజనిర్ధారణ కమిటీని వేయమంటే ఇప్పుడే వేస్తానన్నారు.

### విజన్ వారికి విషపూరితం..
ప్రజల భవిష్యత్తు కోసం తాము ప్రకటించిన విజన్.. కొద్ది మందికి పాయిజన్‌గా మారి బాధపెడుతోందని సీఎం వ్యాఖ్యానించారు. అధికార పార్టీని విమర్శించడం సహజమే అయినా.. బీఆర్ఎస్ నేతలు పరిధి దాటి విషం కక్కుతున్నారన్నారు. ఆ విషాన్ని శివుడి లెక్క కంఠంలో దాచుకునే శక్తి తనకు ఉందన్నారు. కుళ్లుతో కుంగి, నశించే వారిని ఎవరు కాపాడలేరని.. వారి రోగాలకు ఆరోగ్యశ్రీలో కూడా చికిత్స లేదని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యేకి మాటలు, మూటలు, మాయమాటలు.. ఈ మూడు విషయాలనే తారక మంత్రంగా ఆయన తండ్రి నేర్పారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో బీఆర్ఎస్ నేతలు పీహెచ్‌డీ చేశారన్నారు. వారి సలహాలు మాంసం తిని, మద్యం మత్తులో మంత్రాలు చదివినట్లు ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రజల కోసం.. ప్రణాళికలు తయారు చేసి.. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చి.. తొలి విడతలో 1 ట్రిలియన్, రెండో విడతలో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామన్నారు.

### లైవ్ పోతే 10.. లైక్ కొడితే 20...
బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ద్వారా నెలకు రూ.5 కోట్లు ఖర్చుచేసి అబద్ధాలు ప్రచారం చేస్తోందని రేవంత్ ఆరోపించారు. అబద్ధాల లైవ్ పోతే రూ.10, దానికి లైక్ కొడితే 50, కామెంట్ చేస్తే రూ.100 పంచుతోందన్నారు. నగదుకు నజారానా పెట్టి.. నూతన భట్రాజుల్లా తయారయ్యారని వ్యాఖ్యానించారు. 'మీ నాన్న మీకు గొప్ప ఫాంహౌస్, పత్రిక, టీవీ అన్నీ ఇచ్చాడు. కానీ, తెలంగాణ ప్రజలకు ఏమిచారు? చిప్ప, రూ.8 లక్షల కోట్ల అప్పు తప్ప!' అని కేటీఆర్‌నుద్దేశించి రేవంత్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం సోనియమ్మ దయతో వచ్చిందని కేసీఆర్ అసెంబ్లీలోనే చెప్పారని, ఆయన మాటలకు కూడా వీళ్లు వ్యతిరేకమా? అని ప్రశ్నించారు.

### పంటల మార్పిడిపై ప్రణాళిక..
విజన్ 2047లో భాగంగా రేర్ (గ్రామీణ వ్యవసాయ ప్రాంతం)లో ఉన్న లక్ష చదరపు కిలోమీటర్లను వ్యవసాయపరంగా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ అన్నారు. పంట మార్పిడి ఎలా? పంటల మార్పిడి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇప్పుడు కేటీఆర్ వెనక కూర్చున్న ఎమ్మెల్యే (కౌశిక్‌రెడ్డి) తన దగ్గర ఉన్నప్పుడు బాగానే ఉన్నారని, ఇప్పుడిలా చంపండి.. నరకండి.. కుప్పలేయండి అనే భాష నేర్చుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ వాళ్లు డ్రగ్స్, పబ్స్‌కి యువతను అంకితం చేశారని, తాము క్రీడా విధానాలు తెచ్చామని తెలిపారు. "ఫుట్‌బాల్‌లో దిగ్గజమైన మెస్సీతీసుకొస్తే విమర్శలా? వాళ్ల డ్రగ్స్ లోకల్‌ప్లేయర్స్ నిన్న ఇక్కడ ఫాంహౌస్‌లో దొరికారు కదా?" ప్రశ్నించారు. హిల్ట్ విధానం, టీడీఆర్‌లపై ఏవేవో విమర్శలు చేస్తున్నారని, వాటిపై కేటీఆర్, హర?షరావు ఏ విచారణ అడిగినా వేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్స్(ఏటీసీ)లో చేరిన ప్రతి విద్యార్థికి నెలకు రూ.2వేలు ఉపకార వేతనం ఇస్తామని, 100 ఏటీసీలు ఏర్పాటు చేసేందుకు ప్రసిద్ధ టాటా గ్రూప్ ముందుకొచ్చిందని అన్నారు.


### బలిదానాలు 4 కోట్ల మంది కోసం..
"తెలంగాణ ఉద్యమం సందర్భంగా భావోద్వేగాలతో 1200 మంది ఆత్మార్పణలు చేశారు. ఇవి ఆ నలుగురి కోసమే, తమ కుటుంబం కోసమే అన్నట్లుగా బీఆర్ఎస్ పనిచేసింది. నాలుగుకోట్ల నా తెలంగాణ కుటుంబసభ్యుల కోసం మేం ప్రణాళికలు వేసి సభలో పెట్టాం. వారు నోటిఫికేషన్లు ఇచ్చి పారిపోతే మేం ఇప్పటివరకు 67,763 మందికి నియామక పత్రాలిచ్చాం. ఇంకో 13,197ఉద్యోగాల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఇవి కూడా పూర్తయితే 80వేలమందికి ఉద్యోగాలు ఇచ్చినట్లవుతుంది" అని రేవంత్ అన్నారు. సిగ్గులేకుండా అప్పుల గురించి మాట్లాడుతున్నారని, 2014 వారికి అధికారం అప్పగించినప్పుడు రూ.67 వేల కోట్ల అప్పులు ఉంటే బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో చేసిన మొత్తం అప్పులు రూ.8.11 లక్షల కోట్లు అని అన్నారు. ఏకంగా 11.5శాతం వడ్డీకి రుణాలు తెచ్చారని, కమీషన్లకు కక్కుర్తిపడ్డారని ఆరోపించారు. నేను ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్‌ల దగ్గరకు తిరిగి తిరిగి 27వేల కోట్ల పైచిలుకు రుణాల రీకన్‌స్ట్రక్షన్ చేశామని, దీంతో ఏటా రూ.4వేల కోట్లు మిగులుతోందని చెప్పారు. మొత్తంగా 2లక్షల కోట్ల అప్పు రీ కన్‌స్ట్రక్షన్ చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

### సొంతింటి ఆడబిడ్డ కన్నీటితో వీధిలోకి...
తాము మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం కల్పించామని, బీఆర్ఎ?సలో మాత్రం సొంతింటి ఆడబిడ్డ కన్నీరు పెట్టి వీధిలోకి వచ్చిందని రేవంత్ అన్నారు. "నీ సొంతింటి ఆడబిడ్డను లిక్కర్ రాణి అని నీ పక్కన కూర్చున్నోళ్లే అన్నారు. సోదరుడిగా చీమ కుట్టినట్లు ఉండదా? ఈ ఒక్క ఉదాహరణ చాలు మీ శైలి ఏంటో చెప్పడానికి" అని ఎద్దేవా చేశారు. సీఎం సహాయనిధిని బీఆర్ఎస్ వాళ్ల చుట్టాలు, కావాల్సిన వాళ్లకు ఇచ్చి చెక్కులు కూడా వాళ్ల ఖాతాల్లోనే వేసుకుని దొంగిలించిన దొంగలని ఆరోపించారు. "మీకు వచ్చే ఎన్నికల్లో వంద నియోజకవర్గాల్లో డిపాజిట్ వస్తే ముక్కు నేలకు రాస్తా. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట ఎక్కడా వివక్ష చూపకుండా ఇళ్లు మంజూరు చేశాం. రాష్ట్రంలో ఇప్పటివరకు 5100 కోట్లు ఎవరు పనిచేసుకుంటే వారి ఇళ్ల నిర్మాణం కోసం టకా టకా పడేటట్లు చేశాం. రూ.18 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చాం. రేపు 22న మళ్లీ మొదలుపెడుతున్నాం. సన్నవడ్లకు బోనస్‌గా రూ.1940 కోట్లు ఇచ్చాం. ఇవి మా గ్యారంటీలు. అమలుచేశాం" అని సీఎం వివరించారు.

### రాష్ట్ర ప్రజలకు సీఎం ఉగాది శుభాకాంక్షలు
రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికీ శుభం కలగాలని సీఎం ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని సీఎం అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాది రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు చాటి చెప్పేలా అందరు ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.




## బేటి బచావో బేటి పడావో పోస్టర్ ఆవిష్కరించిన సర్పంచ్- సురేష్



**కోదాడ, మార్చి 18 (మీడియా టుడే)–:**
కోదాడ మండల పరిధిలోని ద్వారకుంట గ్రామం లో బుధవారం గ్రామంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా భేటీ బచావో బేటి పడావో మరియు బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన కల్పిస్తూ దోరకుంట గ్రామంలో పోస్టర్స్ ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ పాలకి సురేష్ గ్రామంలో బాల్యవివాహాలు చేయటం చట్టరీత్యా నేరం ఎప్పటికప్పుడు అంగన్వాడి టీచర్ల ద్వారా సమాచారం తీసుకొని బాల్యవివాహాలను అరికట్టాలని కోరినారు. ఇట్టి కార్యక్రమంలో కోదాడ ఐసిడిఎస్ సూపర్వైజర్ డి రమణ అంగన్వాడీ టీచర్స్ ఆదిలక్ష్మి కృష్ణవేణి అరుణ నాగమణి మరియు ఏఎన్ఎం మీనా కుమారి ఆశా వర్కర్లు ఎల్లమ్మ అరుణ గ్రామ శాఖ అధ్యక్షుడు పత్తిపాక వెంకటేశ్వర్లు పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర్లు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**గంభీరావుపేట సీహెచ్ సీ ని పరిశీలించిన కలెక్టర్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 18**
రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీ హెచ్ సీ)లో కలెక్టర్ బుధవారం పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఏ ఏ సేవలు అందుబాటులో ఉన్నాయో వైద్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్ పేషెంట్ వార్డులు, మందులు ఇచ్చే గది, స్టోర్ రూమ్, వ్యాక్సినేషన్ గది, ఎక్స్ రే గది, యునాని హాస్పిటల్, ఆసుపత్రి ఆవరణ అంతా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండాలని ఎంపీడీఓకు సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మరమ్మత్తు పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.రజిత, డీసీ హెచ్ ఎస్ రవీందర్, సర్పంచ్ మల్లుగారి పద్మ, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, డాక్టర్ సృజన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కిట్స్ కళాశాల లో టాస్క్ ఆధ్వర్యంలో నైపుణ్యాబివృద్ధి పై శిక్షణ



**కోదాడ, మార్చి 18 (మీడియా టుడే)–:**
కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి ( టాస్క్ ) ఆధ్వర్యంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ , మూడవ సంవత్సరం చదువు తున్న విద్యార్థినులకు టాస్క్ నిపుణులు మార్క్ లౌయిస్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగినది. ఈ శిక్షణ తరగతులలో విద్యార్థి నులకు సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రాం మీద విద్యార్థి నులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళపల్లి గాంధీ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచం లో విద్యార్థినులు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడు మాత్రమే ఉన్నత ఉపాధి అవకాశాలు అందుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్ డాక్టర్ నాగార్జున రావు, విబాగాదిపతి స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థి నులు పాల్గొన్నారు

# నేటి నీటి పొదుపే రేపటి తరానికి జీవనదారం

### గుగ్గిళ్ళలో బాలవికాస ఆధ్వర్యంలో ప్రపంచనీటి దినోత్సవ అవగాహన సదస్సు



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 18**
సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ళ గ్రామంలో బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా గుగ్గిళ్ళ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి నినాధాలు చేస్తూ గ్రామ పురవీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుగ్గిళ్ల గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, ఉపసర్పంచ్ దుగ్యానీ లావణ్య, వార్డు సభ్యులు హాజరై ప్రపంచ నీటి దినోత్సవం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేడు మనం పొదుపు చేసే ప్రతి నీటి చుక్క రేపటి తరానికి జీవనాధారమని,జలాన్ని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలకు కన్నీరే మిగులుతుందని స్పష్టం చేశారు. అనంతరం గ్రామ కూడలిలో మానవహారంగా ఏర్పడి నీటి సంరక్షణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. బాలవికాస సంస్థ ప్రతినిధులు సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, జలమే మూలమని బాలవికాస సంస్థ కోఆర్డినేటర్లు సుజాత వివరిస్తూ జలం లేనిదే,జీవనం లేదని,ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ,పొలాల్లో పాము పాండు ఏర్పాటు చేసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర జల సంక్షోభం ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీటిని పొడిసి పట్టుకోవడం ద్వారానే భూగర్భ జలాలను కాపాడుకోగలుగుతామని అన్నారు ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ యొక్క వ్యాసరచన పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ పాఠశాల హెడ్మాస్టర్ మమతా గౌతమి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు విద్యార్థులు

# ముందస్తు అరెస్టులను ఖండించిన సేవాలాల్ సేన

### గిరిజన సమస్యలపై చర్చలను అడ్డుకోవడం తగదన్న సేవాలాల్ సేన నాయకులు

### అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు - మండల అధ్యక్షుడు రవికుమార్ నాయక్

**మణుగూరు,మార్చి18(మీడియా టుడే):**
గిరిజన సమస్యలపై తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బాణోత్ హుస్సేన్ నాయక్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించేందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, మణుగూరు మండల సేవాలాల్ సేన కమిటీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో సమస్యలను ప్రస్తావించేందుకు, గిరిజన హక్కుల పరిరక్షణ కోసం జరిగే కార్యక్రమాలను అడ్డుకోవడం తగదని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మణుగూరు మండల సేవాలాల్ సేన అధ్యక్షులు రవికుమార్ నాయక్ మాట్లాడుతూ, ముందస్తు అరెస్టులు చేసి గిరిజనుల గొంతును నొక్కివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. అరెస్టులతో ఉద్యమాలను, గిరిజన సమస్యలపై జరుగుతున్న పోరాటాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపలేరని స్పష్టం చేశారు. గిరిజనుల హక్కులు, భూములు, సంక్షేమం, ఉపాధి, విద్య, నివాస సమస్యల పరిష్కారం కోసం సేవాలాల్ సేన ఎల్లప్పుడూ పోరాట పథంలోనే ఉంటుందని తెలిపారు. గిరిజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు నిర్వహించే సమావేశాలు, చర్చలు, ఉద్యమాలు అణచివేతకు గురికావడం బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. సమస్యలను వినిపించే అవకాశం ఇవ్వాల్సిన బదులు ముందస్తు అరెస్టులకు పాల్పడటం ద్వారా ప్రభుత్వం, అధికార యంత్రాంగం



తప్పు సంకేతాలు ఇస్తోందని విమర్శించారు. గిరిజన ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా నిర్బంధాలతో ముందుకు వెళ్లడం సరైన విధానం కాదన్నారు. ఇలాంటి చర్చలను అడ్డుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని, మరింత ఆవేదన పెరుగుతుందని హెచ్చరించారు. గిరిజనుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సేవాలాల్ సేన భవిష్యత్తులో కూడా ఉద్యమాలను కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర నిర్మల, నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు ఇస్లావత్ కోటియా, మహిళా అధ్యక్షురాలు ద్వాలి, మహిళా ఉపాధ్యక్షురాలు గూగులోత్ కవిత తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్య శిక్షణతో యువతకు ఉద్యోగావకాశాలు

**- జిల్లా ఉపాధి అధికారి శ్రీరామ్. - శిక్షణతో నిరుద్యోగ యువత భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని పిలుపు.**

**నవ ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో యోగ్యత పత్రాల ప్రధానం.**



**పాల్వంచ,మార్చి 18(మీడియా టుడే):**
నవ లిమిటెడ్ పాల్వంచ వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నవ ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్లో వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రికల్, సోలార్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు యోగ్యత పత్రాల ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధి అధికారి కె. శ్రీరామ్ హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు యోగ్యత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీరామ్ మాట్లాడుతూ, నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో అత్యాధునిక పరికరాలతో నిర్వహిస్తున్న ఈ వృత్తి విద్యా శిక్షణ కేంద్రం నిరుద్యోగ యువతకు గొప్ప వరమని అన్నారు. ఇటువంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు .అనంతరం సి. హెచ్. శ్రీనివాసరావు, మేనేజర్ సిఎస్ఆర్ మాట్లాడుతూ, ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో ఇప్పటివరకు 2000 మందికి పైగా వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి సింగరేణి, కేటీపీఎస్, బీహెచ్ఈఎల్ వంటి ప్రముఖ సంస్థలలోనే కాకుండా కిర్బీ బిల్డింగ్స్, ఎంటార్, హెరిటేజ్ వంటి ప్రైవేట్ సంస్థల్లో కూడా ఉద్యోగ అవకాశాలు లభించాయని వివరించారు. వెల్డర్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థి సాయిబాబు మాట్లాడుతూ, ఈ శిక్షణ తనకు ఎంతో ఉపయోగపడిందని శిక్షణ అనంతరం వెమ్ టెక్నాలజీస్ సంస్థలో నెలకు రూ. 18 వేల వేతనంతో ఉద్యోగం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యు. ఎస్. ఎన్. శర్మ, బిన్ను, సాయి, శ్రావణ్, శ్యాం, మహేష్, సాయిబాబు, ఉదయ్ కుమార్, అలీ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 18 :**
ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 'స్టాటిక్ ఫోర్స్'తో పటిష్ట భద్రత మరియు ?అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పేర్కొన్నారు. ?విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో, కరీంనగర్ లో పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ?ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు 'స్టాటిక్ ఫోర్స్'ను కేటాయించామని, పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ?పరీక్షా విధుల్లో ఉన్న



సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇతర పోలీసు అధికారులు మరియు విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువత కోసం"యువ మండల్ వికాస్ అభియాన్"



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే: మార్చి 18** : గ్రామీణ యువతను ఏకం చేసి వారిని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా 'మై భారత్ రాజన్న సిరిసిల్ల, శ్రీకృష్ణ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అనంతారం గ్రామంలో "యువ మండల్ వికాస్ అభియాన్" కార్యక్రమాన్ని 5 రోజులలో 50 గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో యువజన నాయకులకు యూత్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా డివైఓ వెంకట రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న యువజన సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం అని తెలిపారు. ఇప్పటివరకు యువజన సంఘాలు లేని ప్రాంతాల్లో నూతన. సంఘాలను ఏర్పాటు చేసి, వారిని 'మై భారత్ కరీంనగర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా విభాగాలకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో మై భారత్ నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుగ్గా పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమం లో ఆర్గనైజర్ అక్కేం నాగరాజు,అనంతారం గ్రామ సర్పంచ్ ఒల్లాల రజిత వెంకటేష్ ఉపసర్పంచ్ కదం జయంత్, వార్డ్ సభ్యులు అక్కెం ఉపేందర్ , మల్యాల రాజశేఖర్, బట్టి క్రాంతి, శిలాపురం రమేష్, యువజన సంఘం సభ్యులు , బొల్లం శ్రీకాంత్, బండారి వెంకటేష్, గోనెపెల్లి వెంకటేష్, ఒల్లల కృష్ణకుమార్, కదం రాజు,ధరవేణి నాగరాజు ఒల్లాల మధు, చల్ల అంజి, అక్కేం హరికృష్ణ,చొప్పరి అభిరామ్, ఒల్లాల శ్రీనివాస్,మల్యాల పర్శరాములు, అరవింద్, వినయ్, స్వామి కిరణ్, అభిషేక్,సురేష్ రాజు సమీర్, రమేష్, వంశీ, తది తరులు పాల్గొన్నారు

# బాధితుల వద్దకే ఆన్సైట్ ఎఫ్ఐఆర్ ద్వారా కేసులు నమోదు

**సంఘటనా స్థలంలోనే ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్**

**జిల్లాలో ఇప్పటివరకు 12 కేసులు నమోదు: జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.ఐపీఎస్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 18**
ప్రజలకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ కీలక ముందడుగు వేసిందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ఐపీఎస్ తెలిపారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వారి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే "ఆన్సైట్ ఎఫ్ఐఆర్" విధానాన్ని జిల్లా వ్యాప్తశీగా అమలు చేస్తున్నామన్నారు.నేరం జరిగిన తరువాత శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం ఒక భారంగా మారకూడదనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ విధానం అమలులో ఉందని తెలిపారు.ఇప్పటికే ఈ విధానం ద్వారా జిల్లాలో 12 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోని బాధితుల వద్ద నుంచే ఫిర్యాదును స్వీకరిస్తారు. ఫిర్యాదు దారులు డయల్ 100కు కాల్ చేసినా, నేరుగా సమాచారం ఇచ్చినా వెంటనే స్పందించి ట్యాబ్‌ల ద్వారా ఆన్లైన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు.రోడ్డు ప్రమాదాలు,గొడవలు వంటి ఘటనల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యసాయం అందిస్తూ ఆసుపత్రికి తరలిస్తారు. ఈ ఆన్సైట్ ఎఫ్ఐఆర్ విధానం ద్వారా రోడ్డు ప్రమాదాలు, గొడవలు, దొంగతనాలు, భార్యాభర్తల వివాదాలు, వేధింపులు, అనుమానాస్పద మృతులు వంటి కేసులను సంఘటనా స్థలంలోనే తక్షణం నమోదు చేసే అవకాశం కలుగుతుంది. ఈ విధానం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందించడమే కాకుండా, పోలీస్ సేవలపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

# డీజిల్ కుంభకోణంపై విచారణ జరపాలి

**దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కర్నే బాబురావు డిమాండ్**



**మణుగూరు,మార్చి18(మీడియా టుడే):**
సింగరేణి మణుగూరు ఏరియాలోని బ్లాస్టింగ్ విభాగం ఎస్ఎంఎస్ ప్లాంట్‌కు చెందిన ట్రక్కుల నుంచి డీజిల్ కుంభకోణం జరిగిందని వస్తున్న ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తేయాలని సామాజిక సేవకుడు కర్నే బాబురావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏరియా ఎస్వో టు జీఎం బి. శ్రీనివాసాచారికి బుధవారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎస్ఎంఎస్ ప్లాంట్‌కు సంబంధించిన ట్రక్కులు రామగుండంకు సరఫరా చేస్తున్న సమయంలో డీజిల్ దొంగతనం జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా ౨+ 28 ౨ 1576 నంబరు గల ట్రక్కు నుంచి మార్చి 12న 58 లీటర్లు, మార్చి 14న 75 లీటర్ల డీజిల్ దొంగిలించబడినట్లు సమాచారం ఉందని ,ఈ ట్రక్కులకు సెన్సార్ ట్రాకింగ్ వ్యవస్థ ఉండటంతో ప్లాంట్ మేనేజర్‌కు సమాచారం చేరి వ్యవహారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు.ఆరోపణలు తీవ్రతరంగా ఉన్న నేపథ్యంలో శాఖాపరమైన విచారణ మాత్రమే కాకుండా, అవసరమైతే సింగరేణి విజిలెన్స్ విభాగం ద్వారా కూడా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కర్నే బాబురావు కోరారు. అదేవిధంగా సంబంధిత ప్రైవేట్ సంస్థకు చెందిన సూపర్వైజర్‌పై గతంలో కూడా ఆరోపణలు ఉన్నాయని, ఈ అంశంపై తాను ఇదివరకే ఏరియా జీఎంకు లిఖితపూర్వక ఫిర్యాదు కూడా చేసినట్లు బాబురావు వెల్లడించారు. వాస్తవాలను నిష్పక్షపాతంగా పరిశీలించి సంస్థ ఆస్తుల రక్షణకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అన్నారు.సెక్యూరిటీ విభాగం సెల్‌ఫోన్ టెక్నాలజీని వినియోగిస్తుంటే, దొంగలు మరింత ఆధునిక పద్ధతులు అవలంబించే స్థాయికి చేరుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.సింగరేణి వంటి ప్రజాసంస్థను కాపాడుకోవాలంటే దొంగతనాల నివారణలో పారదర్శకతతో కూడిన కఠిన చర్యలు తప్పనిసరి అని అన్నారు.

# లారీ -బొలెరో ఢీకొని ఘోర ప్రమాదం

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి - మండల అధ్యక్షులు పిరినాకి నవీన్.**

**బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు.**



**మణుగూరు/పినపాక:,మార్చి18(మీడియా టుడే):**
పినపాక మండలం దుగ్గినేపల్లి గ్రామం వద్ద లారీ--బొలెరో ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ఆరుగురు రైతు కూలీలు గాయపడినట్లు సమాచారం. గాయపడిన వారు మణుగూరు నుంచి రాజుపేట వైపు వెళు తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానిక నాయకులు, అధికారులు స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు బాధితులను పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి అన్ని విధాలుగా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.అలాగే మణుగూరు మండలంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అవసరమైతే పరిస్థితిని బట్టి వారిని భద్రాచలం, ఖమ్మం, హైదరాబాద్ ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలని కోరినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రమాదంలో గాయపడిన రైతు కూలీలకు తక్షణ వైద్య సేవలు అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం, పార్టీ తరఫున అండగా ఉంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా కార్మికులను తరలించే వాహనాలు మరింత అప్రమత్తంగా నడపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివసైదులు, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ గౌరీ ప్రసాద్, మండల నాయకులు రామ్‌రెడ్డి, దొడ్డపనేని మధు, చప్పిడి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు, వృద్ధులకి ఇందిరమ్మ ఇండ్లను గ్రౌండ్ ఫ్లోర్‌లో కేటాయించాలి

**టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కాంక్ష**



**( సూర్యాపేట జిల్లా)// హుజూర్ నగర్ : మీడియా టుడే మార్చి 18:**
హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లని ఉగాది,శ్రీరామనవమి లేదా వచ్చే నెల మొదటి వారంలో సీఎం సమక్షంలో ఇవ్వ ఉండగా అర్హులైన వారికి ఇండ్లను ఇచ్చే క్రమంలో దివ్యాం గులకు, వృద్ధులకి కింద వరుసలో ఇవ్వాలని టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి అధికారులను ప్రభుత్వాన్ని కోరారు.ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ముహూర్తం రానే వచ్చిందని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సుదీర్ఘ పోరాటం చేసి ఎండోమెంట్ భూమి సేకరణ చేసి దేవుడు గుట్ట వద్ద 2160ఇండ్లు ని కట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో కాల్వకట్ట రోడ్ల పక్కన ఇండ్లని తొలగించిన వారికి ప్రథమ ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంకన్న, రాము, స్వరూప,రాము,మనీ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే:మార్చి 18**
జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాపై పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఎల్‌పీజీ గ్యాస్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు తెలిపారు.ఈ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించేందుకు టి. సృజన, వి. వినాయక్ లు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 8008429738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని తెలిపారు జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతో పాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామన్నారు. కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు

# గరిడేపల్లి మండల ప్రజలందరికీ అధికారులకు ప్రజా ప్రతినిధులకు పరాభవ నామ సంవత్సర (ఉగాది )శుభాకాంక్షలు

**గరిడేపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బిక్షం గౌడ్**



**(మీడియా టుడే గరిడేపల్లి)**
కొత్త ఆశలతో, కొత్త సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సంధ ర్భంగా ప్రజలందరికీ మంచి జరగాలని ఆశిస్తూ..ఈ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని, ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పంటలు బాగా పండి రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని అభిలషించారు.మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఈ ఉగాదిని మండల ప్రజలు అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు.

# మున్సిపల్ కమిషనం జర ఇదర్ దేఖోజీ

**సిపిఐ సూచన**

**( సూర్యాపేట జిల్లా)// హుజూర్ నగర్ : మీడియా టుడే మార్చి 18:**
సీసీ రోడ్డు పోసి ఇరువైపులా మట్టి పోయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అలాగే పెరుగుతున్న కంపచెట్లు తక్షణమే తొలగించాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుదు ధూళిపాళ ధనుంజయ నాయుడు మున్సిపల్ కమిషనర్ ని కోరారు. బుధవారం ఆయన నేరేడుచర్ల లోని వివిధ వార్డులలో ఉన్న సిసి రోడ్లను రోడ్డుకి ఇరువైపులా ఉన్న కంప చెట్లను సిపిఐ బృందంతో కలిసి పరిశీలించి న పిమ్మట ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఒకపక్క మంత్రి అంతర్గత రోడ్లకు వందలాది కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని రోడ్లకు మహర్దశ వస్తుందని చెబుతున్నారని అందుకు అభినందనలు తెలియజేస్తున్నామని, కానీ పట్టణంలోని అంతర్గత సిసి రోడ్ల పట్ల అలాగే మండలశీలో ఇటీవల కాలంలో వేసిన సిసి రోడ్లకు ఇరువైపులా మట్టి పోయడం లేదని ఎదురెదురుగా వాహనాలు వస్తే రోడ్డు దిగే పరిస్థితి లేదని ఇందుకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన ప్రశ్నించారు. పట్టణంలోని అనేక చికెన్ దుకాణాల ముందు వ్యర్థాలు పేరుకు పోతున్నాయని, వారు కనీసం డస్ట్ బిన్ ఉపయోగించకున్నా అడిగే నాధుడే లేదని, రోడ్డుకి ఇరువైపులా కంపచెట్లు పెరిగి రోడ్డు మీదికి వస్తున్నాయని అటుపక్క కంప చెట్లు ఇటుపక్క కంపచెట్లు పెరగడం వల్ల వాహనాలకు పంక్చర్లు అవుతున్నాయని, తక్షణమే వాటిని తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులు అప్రమత్తంగా ఉండకపోతే పాలకులు బదనాం అవుతారని ఇటీవల కాలంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ఎప్పటికప్పుడు పరిశీలన చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోఆయన వెంట మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఘా లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్, సిపిఐ నాయకుడు శీలం రాంబాబు ఉన్నారు.

## వాణినికేతన్ హైస్కూల్ లో ముందస్తు ఉగాది వేడుకలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి 18:**
సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హై స్కూల్ లో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో బుధవారం ఉగాది పచ్చడిని తయారుచేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉగ అంటే నక్షత్ర గమనం, ఆది అంటే మొదలు అన్నారు. వసంత రుతువు ఆరంభం అవుతుండడంతో చెట్లు చిగురిస్తాయని పేర్కొన్నారు. షడ్రుచుల సమ్మిళితమైన ఉగాది పచ్చడి లాగా ప్రతి ఒక్కరి జీవితాలలో కష్టసుఖాలు ఉంటాయని వాటిని సమానంగా స్వీకరించాలన్నారు. గత సంవత్సరపు చేదు జ్ఞాపకాలను మర్చిపోయి కొత్త సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీ పరాభవనామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు సుమంగళి, శోభ, రేఖ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, రేణుక, జలజ, శాంత, పద్మ, రేణుక, సునీత, స్వాతి, శ్రీనివాస్, రాజు, సంతోష్, తిరుపతి, రాజు, రమేష్ లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు

## కెసిఆర్ పాలనలో వ్యవసాయం స్వర్ణ యుగం




**(గరిడేపల్లి మీడియా టుడే మార్చ్ 18 )**
తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్ర వ్యవసాయ రంగం స్వర్ణయుగాన్ని చూసిందని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, సింగిల్ విండో డైరెక్టర్ గుగులోతు నీలా హేమ్లా నాయక్ పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. మండల కేంద్రమైన గరిడేపల్లి లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుబంధు వంటి వినూత్న పథకంతో నేరుగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమచేసి రైతన్నలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విస్తరణతో లక్షల ఎకరాలకు నీరందించి, ఎండిపోయిన భూములను సస్యశ్యామలం చేశారని గుర్తుచేశారు. రైతు బీమా, ఉచిత విద్యుత్, మార్కెట్ సదుపాయాల మెరుగుదల వంటి చర్య

## భద్రగిరి మార్ట్ లోగో సిద్ధం - ఐటీడీఏ పిఓ

**భద్రాచలం,మార్చి 18(మీడియా టుడే):**




భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన భద్రగిరిమార్ట్ కు లోగో సిద్ధమైనట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఐఏఎస్ బుధవారం నాడు వెల్లడించారు. భద్రగిరిమార్టుకు చక్కని లోగో పంపించాలని ఆహ్వానం పలకగా అనేకమంది ఈ కాంపిటీషన్లో పాల్గొన్నారన్నారని, చక్కని లోగోలు పంపించారని ఇందులో ఉత్తమ దానిని ఎంపిక చేయడం జరిగిందని పిఓ ప్రకటించారు. శ్రీరామనవమికి ఈ భద్రగిరి మార్ట్ ప్రారంభించడం జరుగుతుందని ఈ చక్కని అవకాశాన్ని స్థానికులు ఉపయోగించుకోవాలని కోరారు.

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రేపటి నుంచి శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.

# మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టాలి

### జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు శాఖల సమన్వయం కీలకం: కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మర్చి18(మీడియా టుడే):**
జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ, అక్రమ రవాణా, సాగు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్తో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి మాదకద్రవ్య నియంత్రణ కమిటీ సమావేశంలో మాట్లాడిన కలెక్టర్, చెక్‌పోస్టుల వద్ద నిశిత తనిఖీలు నిర్వహించేందుకు అవసరమైన ఆధునిక యంత్రాల ఏర్పాటుపై సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు.గ్రామాల్లో గుడుంబా తయారీ, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రతి శాఖ తమ పరిధిలో చేపట్టిన చర్యలు, నిర్వహించిన తనిఖీలు, నమోదు చేసిన కేసుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికలను ప్రతి నెల సమర్పించాలని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, నిర్లక్ష్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.వ్యవసాయ శాఖ అధికారులు మారుమూల ప్రాంతాల్లో నిశిత పరిశీలనలు నిర్వహించి ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ప్రతి బుధవారం మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలల పరిధిలో 100 మీటర్ల లోపల పాన్ షాపులు, ఇతర దుకాణాల్లో సిగరెట్లు లేదా మాదకద్రవ్యాల విక్రయాన్ని అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ.., రవాణా శాఖ తనిఖీలను ముమ్మరం చేసి తనిఖీల వివరాలు, నమోదు చేసిన కేసుల వివరాలను సమయానుకూలంగా అందించాలని కోరారు. వైద్య శాఖ పరిధిలో నిర్వహిస్తున్న డి-అడిక్షన్ కేంద్రాల్లో నమోదైన కేసుల వివరాలను కూడా తెలియజేయాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లా కావడంతో మాదకద్రవ్యాల రవాణా అధికంగా ఉండే అవకాశముందని, గత నెలలో సుమారు 6,000 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.కాలనీల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ నార్కోటిక్ డాగ్స్ సహాయంతో రాష్ట్రంలోనే తొలిసారిగా కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. కళాశాలల్లో మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్న విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, తీవ్ర స్థాయిలో బానిసలైన వారిని డి-అడిక్షన్ కేంద్రాలకు తరలిస్తున్నామని వెల్లడించారు.ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారం రాథోడ్, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, డ్రగ్ ఇన్స్పెక్టర్ అశ్విని, పోలీస్, అటవీ ,ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దళారీల మాటలతో మల్టీపర్పస్ వర్కర్స్ మోసపోవద్దు

**( మీడియా టుడే గరిడేపల్లి మార్చి 18)**



మల్టీపర్పస్ వర్కర్లుగా ఉద్యోగం ఇస్తామంటూ చెప్పే మాయమాటలు నమ్మి దళారుల చేతిలో అమాయకులు మోసపోవద్దని ఉప సర్పంచ్ జోగు అరవింద్ రెడ్డి అన్నారు .బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ. మండలంలోని పొనుగోడు గ్రామంలో పంచాయతీ వర్కర్స్ గా మల్టీపర్పస్ విధానంతో కొందరిని తీసుకోబడును అని గ్రామంలో జరుగుతున్న ప్రచారంతో, ఇదే అదునుగా కొందరు దళారీలు అమాయకుల దగ్గర ఒక్కొక్కరి నుండి లక్ష రూపాయల తీసుకొని ఉద్యోగం ఇప్పిస్తామని తమ చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్లు అరవింద్ రెడ్డి తెలిపారు. మల్టీ పర్పస్ ను రాష్ట్ర వ్యాప్తంగా తీసుకోవడం జరుగుతుందని, అలా కాకుండా ఏ ఒక్క మండలానికి, గ్రామానికి వరకే ఎలా తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. అందుకని మల్టీపర్పస్ వర్కర్స్ గా చేరు వారు దళారీల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆయన కోరారు. సిబ్బంది కొరత వలన ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్ లైన్ విధానం ద్వారా మల్టిపర్పస వర్కర్లు ను తీసుకోబడుతుంది. మల్టీపర్పస్ విధానం ద్వారా సిబ్బందిని తీసుకోవాలని ప్రభుత్వ నుండి ఇప్పటి వరకు ఎలాంటి సర్క్యులర్ విడుదల కాలేదు. అలా కాకుండా ప్రభుత్వానికి,అధికారులకు సంబంధం లేకుండా కేవలం దళారుల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మల్టీ పర్పస్ వర్కర్స్ గా అక్రమమార్గంలో చేరిన వారిని తాత్కాలికంగా పనిచేయించుకొని ఏ క్షణంలోనైనా వారిని తొలగించబడుతుంది. కాబట్టి దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆయన తెలిపారు

# ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్ -డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో బ్యాంకులకు ఆదేశాలు**

**రైతు రుణాలు, ఎంఎస్ఎంఈ, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మర్చి18(మీడియా టుడే):**
జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. డిసెంబర్-2025 త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించబడింది. సమావేశంలో 31-12-2025 నాటికి జిల్లాలో మొత్తం ప్రాధాన్యతా రంగంలో రూ.4945.28 కోట్ల లక్ష్యానికి గాను రూ.4010.50 కోట్లు మంజూరు చేసి 81.10 శాతం సాధన నమోదైనట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో రూ.3899.28 కోట్ల లక్ష్యానికి గాను రూ.3339.70 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ.847.80 కోట్ల లక్ష్యానికి గాను రూ.563.90 కోట్లు, విద్యా రుణాల్లో రూ.13 కోట్ల లక్ష్యానికి గాను రూ.9.70 కోట్లు, గృహ రుణాల్లో రూ.26.30 కోట్ల లక్ష్యానికి గాను రూ.21.68 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.3.24 కోట్ల లక్ష్యానికి గాను రూ.12.37 కోట్లు మంజూరు కావడం సానుకూలమని పేర్కొన్నారు.

**రైతు రుణాలు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష..**
రైతు రుణాల పంపిణీపై బ్యాంకుల వారీగా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పంట రుణాల పంపిణీ తక్కువగా ఉన్న బ్యాంకుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు రుణాలను సకాలంలో రీన్యువల్ చేసుకునేలా అవగాహన




కల్పించాలని, వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు--బ్యాంక్ లింకేజీ, ఎన్పీఏల తగ్గింపు, పీఎం స్వనిధి, పీఎంఈజీపీ, పీఎం ముద్ర, పీఎం విశ్వకర్మ, పీఎంఎఫ్ఎంఈ, ఏఐఎఫ్ వంటి ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలుపై కూడా సమీక్షించారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం నాబార్డ్ రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, సీపీవో సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, నాబార్డ్, రిజర్వ్ బ్యాంక్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులుగా కక్కునూరు వెంకటేష్ గుప్తాకు ఘన సన్మానం



**మీడియా టుడే ?షాద్‌నగర్ మార్చి 18:**
భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన కక్కునూరు వెంకటేష్ గుప్తాను ఫరూక్ నగర్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ గుప్తా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని వెంకటేష్ గుప్తాను శాలువా, పూలమాలలతో ఘనంగా గౌరవించారు.?సేవా గుణానికి దక్కిన గుర్తింపు: ఎల్కుర్తి నారాయణ గుప్తా?ఈ సందర్భంగా ఎల్కుర్తి నారాయణ గుప్తా మాట్లాడుతూ, కక్కునూరు వెంకటేష్ గుప్తాకు జిల్లా స్థాయి పదవి దక్కడం ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణమని కొనియాడారు. పార్టీ పట్ల ఆయన చూపిస్తున్న నిబద్ధత, సామాజిక సేవా కార్యక్రమాలే ఆయనను ఈ స్థాయికి చేర్చాయని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు.?అంకితభావం కలిగిన నాయకుడు: నీల రవీందర్?సామాజిక కార్యకర్త నీల రవీందర్ మాట్లాడుతూ, కార్యకర్తల పక్షాన నిలబడే నాయకుడు వెంకటేష్ గుప్తా అని ప్రశంసించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఆయన నియామకం పార్టీ బలోపేతానికి ఎంతో దోహదపడుతుందని, సామాజిక సమస్యల పరిష్కారంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు.?పాల్గొన్న ముఖ్యులు?ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు టంగుటూరి విజయకుమార్, బండారు శంకర్, గజవాడ యశ్వంత్, మలిపెద్ది శ్రీనివాస్ (పొట్టు) తో పాటు మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తమ కమ్యూనిటీకి చెందిన వ్యక్తికి జిల్లా స్థాయిలో ప్రాధాన్యత దక్కడం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు.

# పేద ముస్లిం కుటుంబాలకు కాంగ్రెస్ తోడ్పాటు

**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు- ముప్పా రామారావు**

**దమ్మాయిగూడలో రంజాన్ తోఫాల పంపిణీ**



**మీడియా టుడే/ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా:దమ్మాయిగూడ మార్చ్ 18** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని దమ్మాయిగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్ జి కె కాలనీ లో ముస్లిం సోదరులకు తోఫాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ.. రంజాన్ పండుగ శాంతి, సౌహార్ద్రానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందని తెలిపారు. పేద ముస్లిం కుటుంబాలకు తోడ్పాటుగా తోఫాలు అందించడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. పార్టీ ఎల్లప్పుడూ సెక్యులర్ విలువలకు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

**మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత రాజు ముదిరాజు మాట్లాడుతూ**

అవసరమైన వారికి సహాయం చేయడం సమాజ బాధ్యత అని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగ పేదలతో ఆనందాన్ని పంచుకునే సందర్భంగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, రఫిక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పర్వదినం సందర్భంగా కిట్లు పంపిణీ




**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి మార్చి 18**

రంజాన్ పర్వదిన సందర్భంగా కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో రంజాన్ కిట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగ ప్రశాంత వాతావరణ ంలో సంతోషంగా జరుపుకోవాలని కోరారు. సొంతంగా ఆరు రకాల వస్తువులతో పాటు బియ్యాన్ని పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మక్బుల్, రమాకాంత్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి హనుమాన్ నాయక్ కల్లోజు రాజేష్ కుమార్ మాజీ కౌన్సిలర్లు గోరట శ్రీనివాసులు, చిన్న, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు జమ్ముల శ్రీకాంత్, సంతు యాదవ్ ,శేఖర్ ,రేష్మ బేగం, రెహనా బేగం, పడకండి వెంకటేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

## సన్న బియ్యం స్టాక్ పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలి

**-అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి.**

**-బఫర్ గోదాంలకు అలాట్మెంట్ చేసిన జిపిఓలు, సంబంధిత అధికారులతో బియ్యం స్టాక్ పంపిణీపై సమీక్షించిన అదనపు కలెక్టర్.**



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

సన్న బియ్యం స్టాక్ పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, బఫర్ గోదాంలకు అలాట్మెంట్ చేసిన జిపిఓలు, సంబంధిత అధికారులతో 3 నెలల బియ్యం స్టాక్ పంపిణీపై సమీక్షించారు.

**అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ**

ఏప్రిల్ నుంచి జూన్- 2026 వరకు గల 3 నెలల రేషన్ ను ఒకేసారి అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. మూడు నెలల రేషన్ సరఫరాకు సంబంధించి 12 బఫర్ గోదాములకు 12 మంది జిపిఓ లను ఇంచార్జి లుగా నియమించడం జరిగిందని, 3 నెలల రేషన్ లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు వీలుగా రేషన్ షాపుల వారీగా స్టాక్ పంపిణీ జరిగేలా చూడాలని అన్నారు. బఫర్ గోడౌన్ నుంచి స్టేజి 1 ద్వారా ఎం.ఎల్.ఎస్. పాయింట్ లకు రేషన్ సరఫరా సకాలంలో పంపిణి చేయాలని, మన జిల్లా అవసరాలకు 25 వేల మెట్రిక్ టన్నులు, ఇతర జిల్లాల కోసం పంపిణి చేసే బియ్యం క్వాంటిటి కూడా సరిగ్గా ఉండేలా చూడాలని అన్నారు. బియ్యం పంపిణీ ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలని అన్నారు. ఎం.ఎల్.ఎస్. పాయింట్ నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలింపు కూడా ఉదయం 9 గంటలకు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. హమాలీలు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఎం.ఎల్.ఎస్. పాయింట్ ఇంచార్జి, స్టేజి 1 కాంట్రాక్టర్, గోడౌన్ ఇంచార్జి లు, జిపిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కొరతతో ఎండిపోతున్న పంట పొలాలు

**సాగర్ లో నీళ్లు ఫుల్లు పంట పొలాలకు నిల్లు - ఒరిసాగు.. ఉరిసాగేనా?.. కళ్ళముందే మాడిపోతున్న వరి పంట**

**అధికారులను ప్రాధేయపడుతున్న రైతన్నలు**




**( సూర్యాపేట జిల్లా)// హుజూర్ నగర్ : మీడియా టుడే మార్చి 18 :** సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు గ్రామంలో సాగునీటి కొరతతో యాసంగి వరి పంటలు నిలువునా ఎండిపోతున్నాయి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు సాగర్లో నీళ్లు ఉన్న పంట పొలాలకు నీళ్లు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. అని రైతులు ఆవేదనని వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు లేక ఎండిపోతున్న పొలాలను చూసి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. సాగర్లో నీళ్లు ఉన్నా కాలువకు నీరు విడుదల చేయకపోవడంతో వేలాది ఎకరాల పొలాలు ఎండుతున్నాయి.సాగర్లో నీళ్లు ఉన్నా కానీ టన్నర్లు అని పెట్టి పంట పొలాలు పొట్ట దశలో వున్నాప్పుడు నీరు ఆపి పది రోజులు కావాస్తున్నా కానీ నీరు రాకపోవడంతో రైతులు ఎండుతున్న పొలాలను చూసి బావూరు మంటున్నారు. గత వానాకాలం సీజన్లో సరిగ్గా పొట్ట దశలో ప్రకృతి విపత్తు తుపాను రూపంలో వచ్చి మా పొలాలను పొట్టన పెట్టుకుంది అని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కనీసం యాసంగి సీజన్లోనైనా పంట బాగుంటుంది అని భావిస్తే ఇప్పుడు కూడా పొట్ట దశలో ఇలా నీరు లేక పొలాలు నిలువునా ఎండవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు.

**వెంటనే నీళ్లు విడుదల చేయాలని రైతుల డిమాండ్**

నీళ్లు లేక ఎండిపోతున్న పొలాలను చూసి రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. సాగర్ లో నీళ్లు ఉన్న చివరన ఉన్న మేళ్లచెరువులోని చిత్రియాల, గుండ్లపల్లి కాలువల కింద ఉన్న భూములకు నీళ్లు అందక ఎండిపోతున్నాయని అక్కడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలకు నీళ్లు బంద్ అయి పది రోజులు కావస్తు న్నా ఇంకా నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయి. నీళ్లు వదిలినా తక్కువ వదలటం వల్ల కాలువ చివరన ఉన్న భూములకు నీళ్లు అందకపోవడంతో మరల మట్టపల్లి మేజర్ కాలువకు చింతిరాల కాలవలకు ఇక్కడ టర్నర్ పెట్టడంతో మరలా నాలుగు రోజులు ఆదనంగా నీళ్లు అందడంలో జాప్యం అవుతుండగా మేళ్లచెరువులోని రైతులు పొలాల మీద ఆశలు వదులుకుంటున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని నీళ్లు విడుదల చేసి మా పొలాలను బ్రతికించాలని డిమాండ్ చేస్తున్నారు. నీరు వదలకుంటే వేలాది రూపాయలు పెట్టుబడితో సాగుచేసిన వరి పొలాలు దెబ్బతిని తమ బ్రతుకులు ఆగమవుతాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎండిన పంటను చూస్తే గుండె తరుక్కుపోతుంది**

ఏండిన పంట పొలాలను చూస్తే గుండె చెరువైపోతుందని రైతులు అలమటిస్తున్నారు. కాలువకు నీరు ఎప్పుడు వస్తుందా? అని నీటి కోసం ఎదురుచూసుడు అవుతుందని రైతులు నిరుత్సాహపడుతున్నారు. వారి ఆవేదనను,ఎండిన పంట పొలాలను చూస్తుంటే గుండెలు తరుక్కుపోయేలా ఉన్నాయి. అది చూసిన రైతులు గుండెలు పగిలిపోయేలా భావుర్మంటున్నారు.

**పశువుల మేతకే ఉపయోగపడుతుంది..**

సాక్షాత్తు నీటి పారుదల శాఖ మంత్రి అయిన ఉత్తం కుమార్ రెడ్డి ఇలాకాలో సొంత నియోజకవర్గమైన హుజూర్నగర్ నియోజకవర్గంలోని మేళ్లచెరువులోని రైతులకు ఇలా పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఒకటి రెండు రోజులలో పంట పొలాలకు నీరు అందకపోతే ఈ పంట పశువుల పాలు కాక తప్పదు అని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వర్షాకాల పంటలకు వానలు ఎక్కువయ్యి పంట పడిపోతే ఆదుకునే దిక్కులేదు మరి యాసంగి సీజన్లో నీటి కొరతతో పంట ఎండిపోతే? మాకు దిక్కు ఎవరు

# లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి

**వ్యవసాయం, విద్య, గృహ నిర్మాణం, మహిళా సంఘాలకు - ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు చేయాలి**

**డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో చైర్ పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి 18**

జిల్లాలోని అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ, గృహ, విద్య రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి అమలు, పురోగతి పై బ్యాంకుల వారీగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలోని బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. వ్యవసాయ, విద్య, ఇతర రుణాల లక్ష్యం 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణాలకు రుణం ఇవ్వాలని ఆదేశించారు. బ్యాంక్ ల్లో వినియోగంలో లేని ప్రభుత్వ ఖాతాల వివరాలు తెలుపాలని, కేవైసీ అప్డేట్ చేయించాలని సూచించారు. ఆర్ సేఢీ ఆధ్వర్యంలో ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారో ఆరా తీశారు. వివిధ శాఖలు, పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ ఇవ్వాలని స్వయం ఉపాధి పొందేలా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలపై సమీక్ష చేశారు.



మహిళలు తీసుకుంటున్న రుణాలతో స్వయం ఉపాధికి ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంక్ లలో అందించే సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్ డీ ఎం మల్లికార్జున రావు, ఆర్బీఐ ఏజీఎం రాములు సబావత్, నాబార్డ్ డీడీఎం దిలీప్, యూబీఐ ఏజీఎం సురేష్ కుమార్, టీజీబీ ఆర్ ఎం రాజ నరేంద్ర, డీఆర్డీఓ గీత, డీ వీ హెచ్ ఓ రవీందర్ రెడ్డి, డీ ఏ ఓ అఫ్జల్ బేగం, ఆయా బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రోటవేటర్లు పవర్ స్ప్రేయర్లు రైతులకు పంపిణీ చేసిన : బండారు



**మీడియా టుడే మధిర:**

మధిర పట్టణంలో రైతు వేదిక నందు వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా రోటవేటర్లు మరియు పవర్ స్ప్రేయర్లు బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు మధిర ఎ డి ఎ విజయ్ చంద్ర పేర్కొన్నారు. యాంత్రికరణ పథకం దాదాపుగా 10 సంవత్సరాల అనంతరం ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది అన్నారు. దీనిలో చిన్న,సన్న కారు రైతులకు 50% సబ్సిడీ పెద్ద రైతులకు 40% సబ్సిడీ మీద వ్యవసాయం పనిముట్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎప్పుడు రైతుల్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి,ఆత్మ కమిటీ డైరెక్టర్లు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమటి నవీన్ రెడ్డి, మడుపల్లి కౌన్సిలర్ శీలం నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, వంశీ, జానీ పాషా మధిర మండల వ్యవసాయ సిబ్బంది మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# “చంపినోడే సంతాప సభలు పెట్టినట్లు “ఉంది

**వెలుగుమట్ల ఘటనపై ఖమ్మం ఎమ్మెల్సీ తాత మధు ఫైర్**

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

వెలుగుమట్ల భూదాన భూముల వ్యవహారంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాగాలేదని శాసనమండలిలో ఖమ్మం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో గాజాను తలపించే అంత విధ్వంసం జరిగింది పేదలకు ఇళ్లను కట్టిస్తానన్న ప్రభుత్వమే. పేదల ఇళ్లను నిర్ధాక్షణంగా కూల్చింది ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆందోళనతో ప్రభుత్వం దిగివచ్చి కూల్చిన చోటే పట్టాలు ఇస్తానని చెప్పారు. ఇది ఎలా ఉంది



అంటే చంపినవాడే సంతాప సభ పెట్టినట్లు ఉంది 1895 మంది బాధితులు ఉంటే 311 మందికి మాత్రమే ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది బాధితులు అందరికీ పక్కా ఇళ్లు ఇవ్వాలని నేను డిమాండ్ చేస్తున్నాను - బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్.

## తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు మాజీ ఎంపీ నామ

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**




ఖమ్మం : తెలుగు ప్రజల ముఖ్యమైన పండుగ ఉగాది సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సంతోషం కలగాలని ఆకాంక్షించారు. ఉగాది పండుగ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్త సంవత్సరాన్ని సరికొత్త ఆశయాలు, లక్ష్యాలతో ప్రారంభించి విజయాలను సాధించాలని తెలిపారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, రైతులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు. ఉగాది పండుగ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్న ఆయన, ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మనిషి జీవితంలోని సుఖదుఃఖలు, విజయాపజయాలను సూచిస్తాయని వివరించారు. ప్రతి పరిస్థితిని సమానంగా స్వీకరించే ధైర్యం, సహనం మనలో పెంపొందాలని తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబంలో ఆనందం, సౌభాగ్యం నెలకొనాలని, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగి, సమాజ అభివృద్ధి దిశగా కృషి చేయాలని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమంపై లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ఆవేదన

**అశ్వరావుపేట లేదా దమ్మపేటలో కొబ్బరి బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలి**

**బొగ్గు ఉత్పత్తి--దిగుమతుల అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ**

మీడియా టుడే ఖమ్మం ఆర్సి



ఖమ్మం : తెలంగాణలో వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలను లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ప్రస్తావించారు. రైతుల ఆదాయం స్థిరీకరణ, మార్కెట్ భరోసా, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు దేశంలో బొగ్గు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థపై కూడా కేంద్రాన్ని ప్రశ్నించారు.భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలపై దృష్టి సారించండితెలంగాణలో సుమారు 3,300 ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా, ఇందులో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోనే అధిక విస్తీర్ణం ఉన్నట్లు ఎంపీ తెలిపారు. అశ్వరావుపేట లేదా దమ్మపేటలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు సాంకేతిక సహాయం, నాణ్యమైన సాగు, మార్కెట్ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు .వ్యవసాయానికి ప్రత్యేక మద్దతు అవసరంరాష్ట్రంలోని 14 ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను మెగా ఫుడ్ పార్క్‌లతో సమానంగా గుర్తించాలని సూచించారు. పీఎంకేఎస్ వై కింద మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. దీంతో రైతులకు ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.మక్క రైతులను ఆదుకోండిరాష్ట్రంలో మొక్కజొన్న ఉత్పత్తి సుమారు 16.85 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నప్పటికీ, ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉండటంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టి మార్కెట్ స్థిరీకరణ చేయాలని కేంద్రాన్ని కోరారు.

**ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కావాలి**

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుమారు 97,400 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని పేర్కొన్నారు. క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకం తగ్గింపుతో రైతులకు ధరలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రామగుండం ఫర్టిలైజర్స్‌కు గ్యాస్ సరఫరా పెంచాలని ఎంపీ కోరారు.

**కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు న్యాయం చేయాలి**

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులు 3.47% నుంచి 2.63%కు తగ్గినట్లు పేర్కొన్నారు. దేశ జనాభాలో దాదాపు 46% మంది వ్యవసాయంపై ఆధారపడుతుండగా, జీడీపీలో వాటా కేవలం 16% మాత్రమే ఉందని తెలిపారు. పీఎం-కిసాన్ పథకంలో సుమారు 70 లక్షల మంది లబ్ధిదారులు తగ్గినట్లు ప్రస్తావించారు. కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఇంకా పథకం పరిధిలోకి రాకపోవడం అన్యాయమని విమర్శించారు.

**బొగ్గు ఉత్పత్తి పెరిగినా... దిగుమతులే ఆధారం**

దేశంలో బొగ్గు ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ, దిగుమతులపై ఆధారం పూర్తిగా తగ్గలేదని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి లోక్‌సభలో తెలిపారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా దేశంలో 18,713 మెగావాట్ల సామర్థ్యంతో 17 విద్యుత్ కేంద్రాలు పూర్తిగా దిగుమతి బొగ్గుపైనే నడుస్తున్నాయని వెల్లడించారు. కోల్ ఇండియా లిమిటెడ్ సరఫరాలు 2020-21లో 596.2 మిలియన్ టన్నుల నుంచి 2024-25లో 781.1 మిలియన్ టన్నులకు పెరిగాయని తెలిపారు. 2026 మార్చి 12 నాటికి 122.46 మిలియన్ టన్నుల నిల్వలు ఉన్నట్లు వెల్లడించారు.బొగ్గు రవాణా మెరుగుదలకు 'కోల్ లాజిస్టిక్స్ ప్లాన్' అమలు చేస్తూ, 2030 నాటికి 33 కీలక రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వివరించారు.

# 196 కోట్లతో ఖమ్మం కార్పొరేషన్ బడ్జెట్

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్, సాధారణ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్.**



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

196 కోట్లతో ఖమ్మం కార్పొరేషన్ బడ్జెట్ ప్రతిపాదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో నగర మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్, సాధారణ కౌన్సిల్ సమావేశాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత అత్యంత ముఖ్యమైన కార్పోరేషన్ ఖమ్మం మాత్రమేనని అన్నారు. 196 కోట్లతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ బడ్జెట్ ప్రతిపాదించడం జరిగిందని, ఈ నిధులతో నగరవాసులకు మెరుగైన సేవలు అందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్పోరేషన్ లో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మంచి సంస్కరణలు తీసుకొని వచ్చి చాలా సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించి నందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్పోరేషన్ ప్రతి రోజు పని ఉంటుందని, చెత్త సేకరణ, డ్రైయిన్ క్లీన్ చేయడం, స్ట్రీట్ లైట్ నిర్వహణ, నీటి సరఫరా వంటి పనులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుందని అన్నారు.నగరం పరిధిలో ఉన్న స్ట్రీట్ లైట్ మానిటరింగ్ కోసం సెంటర్ సిస్టం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం కాని పక్షంలో సంబంధిత లబ్ధిదారుల నుంచి లెటర్ తీసుకొని అర్హులైన ఇతర లబ్ధిదారులకు కేటాయింపులు జరిగేలా ఏఈ హౌసింగ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన పురోగతి ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ మొదటి వారం నాటికి ఖమ్మం జిల్లా పరిధిలో 10 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం పూర్తి అవుతాయని కలెక్టర్ తెలిపారు. 43వ డివిజన్ పరిధిలో చేపట్టిన విధంగా కార్పొరేషన్ వ్యాప్తంగా ఆస్తుల విలువలు మరొక్కసారి పరిశీలించి ఆస్తి పన్ను సవరించాలని కలెక్టర్ సూచించారు. నగరంలో ఉన్న భవనాలు, ఇతర నిర్మాణాలను మరొక్కసారి పునః పరిశీలించి వసూలు చేయాల్సిన ఆస్తి పన్ను సవరించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సొంత ఆదాయాలను పెంచుకోవడంపై దృష్టి సారించాలని అన్నారు. నగరంలో డార్క్ ఏరియా గమనించి ఎక్కడ చీకట్లు ఉండకుండా స్ట్రీట్ లైట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వీధి దీపాల మరమ్మత్తు పనులు ఎప్పటికప్పుడు వెంటనే జరిగేలా చూడాలని అన్నారు. విలీన ప్రాంతంలో అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా అవసరమైన చర్యలు చేపట్టవచ్చని అన్నారు. నీటి కనెక్షన్ ఇతర పనుల కోసం రోడ్ల తవ్వకాలు చేపట్టినప్పుడు వాటి మరమ్మత్తుకు కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.వివిధ అభివృద్ధి పనుల కోసం రోడ్ల తవ్వకాలు చేపట్టినప్పుడు మళ్లీ పూర్వపు స్థితికి రోడ్డును తీసుకువచ్చే బాధ్యత తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నగర వ్యాప్తంగా ఉన్న గుంతలను పూడ్చి వేసినందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు పూర్తి చేశామని అన్నారు.నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ అధికంగా జరుగుతుందని, దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున సాంకేతికత ఆధారంగా వీటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని, రాంగ్ సైడ్ డ్రైవింగ్ ను గుర్తించి జరిమానాలు వెంటనే విధించేలా చూడాలని అన్నారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అమృత్ పథకం ద్వారా త్రాగునీటి సరఫరా పనులు, ఎస్.టి.పి. నిర్మాణం , ఖమ్మం ఖిల్లాకు రోప్ వే వంటి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేసేందుకు రెవెన్యూ శాఖ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. డంప్ యార్డ్ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ**

నగర ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కార్పొరేటర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు.నగర ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడం మన ప్రధాన బాధ్యత అని అన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. నగరంలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన లక్ష్యంతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రహదారుల విస్తరణ, డివైడర్ల సుందరీకరణ, ఆధునిక, సురక్షిత ఫుట్ పాత్ ల నిర్మాణం చేస్తున్నామన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. నగర పరిధిలో 2 కోట్ల 50 లక్షలతో ముఖ్యమైన రహదారుల విస్తరణ పనులు చేపట్టామన్నారు. ఈ సంవత్సర కాలంలో 23 కిలోమీటర్ల మేర సిసి రోడ్లు, 18 కిలోమీటర్ల సిసి డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామన్నారు. అమృత్ పథకం క్రింద 229 కోట్లతో చేపట్టిన మంచినీటి సరఫరా పనులు తుది దశలో ఉన్నాయన్నారు.విలీన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కుక్కల సమస్యను పరిష్కరిస్తామన్నారు. అందరి సహకారంతో ఖమ్మం నగరపాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మేయర్ తెలిపారు.బడ్జెట్ 2026-27 అంచనాలను సభకు నగరపాలక సంస్థ పరిపాలన అధికారి సిహెచ్. శ్రీనివాస్ వివరించారు. పన్నుల వనరుల క్రింద 50.43 కోట్లు, పన్నేతర వనరుల ద్వారా 96.94 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్ ల ద్వారా 7.90 కోట్లు, మొత్తంగా 104.84 కోట్ల ఆదాయ అంచనా ఉందన్నారు.ఖర్చుల క్రింద చార్జ్ ఖర్చులు 63.44 కోట్లు, నిర్వహణ ఖర్చులు 18.03 కోట్లు, విలీన గ్రామాలు, పబ్లిక్ ఏమిటెన్స్, వార్డ్ బడ్జెట్ క్రింద 16.01 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్ లు, రుణాల క్రింద 7.90 కోట్లు, క్యాపిటల్ ప్రాజెక్ట్ ఫండ్స్ క్రింద 91.02 కోట్లు గా అంచనా వేశారు. సాధారణ కౌన్సిల్ సమావేశంలో 4రూ. 74.09 కోట్లకు సంబంధించి 22 అంశాలను కౌన్సిల్ ఆమోదం కొరకు నగరపాలక సంస్థ మేనేజర్ జి. శ్రీనివాసరావు సమర్పించారు. ఇందులో 984 మంది అవుట్ సోర్సింగ్ వర్కర్ల వేతనం మునిసిపల్ సాధారణ నిధుల నుండి మంజూరుకు, 20 మంది డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది వేతనములు మునిసిపల్ సాధారణ నిధుల నుండి మంజూరుకు ఇద్దరు మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గౌరవ వేతనం మంజూరుకు, నలుగురు టెక్నికల్ అసిస్టెంట్స్ వేతనాలు మంజూరుకు, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ గౌరవ వేతనం మునిసిపల్ సాధారణ నిధుల నుండి మంజూరుకు, ఒక తహసీల్దార్ సేవలు ఔట్ సోర్సింగ్ పద్ధతిపై వినియోగించుకొనుటకు, పారిశుద్ధ్య, మల్టిపర్పస్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున ప్రస్తుత వేతనానికి అదనంగా చెల్లించుటకు, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఔట్ సోర్సింగ్ కార్మికుడు మల్లెపాక శివకుమార్ కుటుంబానికి పరిహారం క్రింద 2 లక్షలు చెల్లింపులు ఉన్నాయి. సమావేశంలో కార్పొరేటర్లు తీగల వంతెన నిర్మాణం ద్వారా షాపులు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సంక్షేమ పథకాల శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలకు ప్రతిపక్ష కార్పొరేటర్లను పిలవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్న వారి విడతల వారి విచారణ త్వరితగతిన జరిగేలా చూడాలన్నారు. నగరంలో ఇఎస్ఐ ఆసుపత్రి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని, జిపిఎస్ ద్వారా పన్నుల అసెస్మెంట్ చేయాలని అన్నారు. పబ్లిక్ తాయిలెట్ల నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణం తర్వాత సైడ్ మట్టి పనులు చేయట్లేదని, దీనితో ప్రమాదాలు జరుగుతున్నాయని, సదరు కాంట్రాక్టర్ తో పనులు పూర్తి చేయించాలన్నారు. కరంట్ పోల్ వేసేప్పుడు సమాచారం ఇవ్వాలని, సంబంధిత అధికారులు సమన్వయం చేయాలని తెలిపారు. నగరంలో పెయిడ్ పార్కింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. తమ తమ డివిజన్లలో సమస్యలను ఈ సందర్భంగా కార్పొరేటర్లు అధికారుల దృష్టికి తెచ్చారు. త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అద్భుతంగా రాణిస్తూ జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారు

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి - అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్.**



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనేక విభాగాలు, రంగాలలో మహిళలు రాణిస్తూ ఖమ్మం జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళుతున్నారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కొంత ఆలస్యం జరిగినప్పటికీ పండుగ వాతావరణంలో నేడు మహిళా దినోత్సవ వేడుకలు జరుపు కోవడం సంతోషంగా ఉందని అన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనేక విభాగాలలో మహిళలు బాగా రాణిస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ అనేక అంశాలలో ఖమ్మం జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచుతున్నారని తెలిపారు .మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. మహిళ లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, షీ టీమ్స్, భరోసా, ఇందిరా మహిళా శక్తి వంటి అనేక కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు అవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్య, వైద్యం అన్ని రంగాలలో ఖమ్మం జిల్లా ముందుండేలా ఉద్యోగినులు, సిబ్బంది పని చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పరిపాలనలో మహిళా ఉద్యోగినులు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మహిళా శిశు సంక్షేమ శాఖలో అనేక నూతన కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. మంచి పనితీరుతో విధులు నిర్వహిస్తున్న మహిళ సిబ్బందికి నేడు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు భద్రత కల్పించే విధంగా సఖి కేంద్రం పనిచేస్తుందని అన్నారు. అనంతరం డి.ఆర్.ఓ. పద్మశ్రీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ భారతి రాణి, వివిధ రంగాలలో సేవలు అందించిన మహిళలను జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ సమావేశంలో మహిళా ఉద్యోగినులు, జిల్లా అధికారులు, సిడిపిఓ., డి.హెచ్.ఈ. డబ్ల్యూ సమీన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు లో సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోలకు ఘన సన్మానం

**ఉగాది కవి సమ్మేళనంలో కవితాలాపన**

**అభినందించి సత్కరించిన ఏపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి**




**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఘన సత్కారం లభించింది. పరాభవ నామ ఉగాది పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకొని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్యులు మాడభూషి సంపత్ కుమార్ నేతృత్వంలో బుధవారం అధ్యయన కేంద్రంలో రెండు తెలుగు రాష్ట్రాల తెలుగువారితో పాటు, తమిళనాడు కర్ణాటక తదితర రాష్ట్రాలలోని తెలుగు కవయిత్రులు కవులతో ద్వి శతాధిక జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో కట్టెకోలం కట్టెకోల చిన్న నరసయ్య పాల్గొని "అమానవీయ యుద్ధాలు" శీర్షికన రాసిన కవితను ఆలపించారు. అనంతరం ఆచార్యులు సంపత్ కుమార్ నరసయ్యకు ప్రశంసా పత్రాన్ని అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించగా, ఏపీ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కట్టెకోలను అభినందించి జరీ అంచు కండువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు కట్టెకోలను అభినందించారు.

# ప్రతి ఒక్కరికీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**



ఖమ్మం : శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున ఖమ్మం జిల్లా ప్రజలందరికీ , జిల్లా కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు,అభిమానులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ తెలుగు నూతన సంవత్సరం లో రాష్ట్రం, కుటుంబాలు సమృద్ధిగా, సంతోషంగా, ఐక్యంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నామని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ఎల్లప్పుడూ నిబద్ధతో ఉంటుందని, గాంధీజీ ఆదర్శాల మార్గంలో మనందరికీ ఆరోగ్యం, సమృద్ధి, శాంతి కలగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.ఉగాది పచ్చడి తీపి లాంటి కొత్త ఆశలు, అవకాశాలు ప్రతి ఒక్కరి జీవితాల్లో నిండి ఉండాలి అని ఆకాంక్షించారు.

# చంద్రంపేట పాఠశాలలో విద్యార్థులకు ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్ పై అవగాహన

**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 17 :**



ప్రజాపాలనా -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చంద్రంపేటలో సిరిసిల్ల ఫైర్ స్టేషన్ అధికారి నర్మెట్ట నరేందర్ ఆధ్వర్యంలో తమ అగ్నిమపాక సిబ్బంది గణేష్, శశిధర్, శివకుమార్ లతో కలిసి అగ్ని ప్రమాదాల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సిరిసిల్ల ఫైర్ స్టేషన్ అధికారి ఎన్.నరేందర్ అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు అనంతరం ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఫైర్ స్టేషన్ అధికారి నరేందర్,ఫైర్ సిబ్బంది గణేష్, శశిధర్, శివకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కైరి పద్మ, ఉపాధ్యాయ బృందం కొండికొప్పుల రవి, వోద్యారాం మధుసూధన్,ముంజ రమ, లత, త్రివేణీ,విద్యార్థులు పాల్గొన్నారు

# నూతన కార్యవర్గం ఎన్నిక



**రాయికల్-మీడియా టుడే-మార్చి 18:**

రాయికల్ పట్టణంలోని గుడికోటలో బుధవారం ధూప దీప నైవేద్య అర్చకుల సమావేశం జరిగింది. ఇందులో మండల ధూప దీప నైవేద్య అర్చకుల సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మంగోలి సతీష్ శర్మ, ఉపాధ్యక్షులుగా తిరునగరి గోవిందరాజస్వామి, కార్యదర్శిగా కోటగిరి శ్రీనివాస్, కోశాధికారిగా జక్కాపురం శ్రీనివాస్, సలహాదారులుగా దేవుని నారాయణ, ప్రత్యేక సలహాదారులుగా చిలుకమర్రి శ్యాంసుందర్ చారిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చెరుకు అజయ్ కుమార్, చెరుకు శివశర్మ, గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భవిత కోచింగ్ సెంటర్ సంచలనం

**- నవోదయలో 12 సీట్లు, నర్సంపేటకు గర్వకారణం**






**వరంగల్ జిల్లా బ్యూరో మర్చి 18, మీడియా టుడే**

నర్సంపేట పట్టణంలోని అంగడి సెంటర్లో ఉన్న భవిత నవోదయ కోచింగ్ సెంటర్ మరోసారి తన ప్రతిభను నిరూపించింది. 2026 నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఏకంగా 12 మంది విద్యార్థులు సీట్లు సాధించడం స్థానికంగా సంచలనంగా మారింది. ఈ విజయంతో భవిత కోచింగ్ సెంటర్ పేరు జిల్లా దాటీ ఇతర ప్రాంతాలకు కూడా మార్మోగుతోంది. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, నిర్వహణ సమర్థత కలిసివచ్చి ఈ గొప్ప ఫలితాన్ని తీసుకొచ్చాయి.

**విజేతల ఘన సత్కారం -- గర్వంగా నిలిచిన క్షణం.**

ఈ విజయాన్ని... పురస్కరించుకుని రితీష్, రామ్ తేజ్, తేజశ్రీ, లాస్య, జస్మిక, సంకీర్తన తదితర విద్యార్థులను ఘనంగా సన్మానించారు. చైర్మన్ షేర్ల సంతోష్, డైరెక్టర్ షేర్ల సంజన చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, శాలువాలు అందజేసి విద్యార్థులను అభినందించారు. ఈ వేడుకలో తల్లిదండ్రుల ఆనందం, విద్యార్థుల ఉత్సాహం స్పష్టంగా కనిపించాయి.

**అనుభవం, అంకితభావం - విజయానికి బలమైన పునాది**

భవిత కోచింగ్ సెంటర్ గత 12 సంవత్సరాలుగా నాణ్యమైన విద్యాబోధనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. అనుభవజ్ఞులైన అధ్యాపకులు విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి, క్రమశిక్షణతో, లక్ష్యబద్ధంగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 150 మంది విద్యార్థులు నవోదయ సీట్లు సాధించడం ఈ సంస్థ స్థిరమైన విజయయాత్రకు నిదర్శనం.

**జిల్లాల దాటి భవిత ప్రతిష్ట - తల్లిదండ్రుల విశ్వాసానికి చిరునామా**

భవిత కోచింగ్ సెంటర్ పేరు ఇప్పుడు నర్సంపేటకు మాత్రమే పరిమితం కాలేదు. ఇతర జిల్లాల నుంచి కూడా తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేర్పించడం గమనార్హం. మంచి ఫలితాలు, కచ్చితమైన మార్గదర్శకత్వం, క్రమశిక్షణతో కూడిన శిక్షణ – ఇవన్నీ కలిపి భవితను నమ్మకానికి ప్రతీకగా నిలిపాయి.

**షేర్ల సంతోష్ నాయకత్వం - విజయాలకు మార్గదర్శి...**

చైర్మన్ షేర్ల సంతోష్ నాయకత్వంలో భవిత కోచింగ్ సెంటర్ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతోంది. విద్యార్థులను కేవలం పరీక్షలకు మాత్రమే కాకుండా, జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లే విధంగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర కీలకం. ఈ విజయంతో ఆయనపై తల్లిదండ్రుల విశ్వాసం మరింత పెరిగింది.

**తల్లిదండ్రుల ఆకాంక్ష - మరింత మందికి వెలుగు చూపాలి...**

ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, భవిత కోచింగ్ సెంటర్ మరింత మంది విద్యార్థులకు దారి చూపాలని కోరుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు మంచి అవకాశాలు కల్పిస్తూ, వారిని ఉన్నత స్థానాలకు చేర్చాలని ఆకాంక్షించారు.

**ప్రముఖుల సమక్షంలో విజయోత్సవం..**

ఈ కార్యక్రమంలో కాసుల రవికుమార్ (లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకులు), ఎండి అక్బర్ పాషా (భాషిత ఇన్ఫ్రా డెవలప్మెంట్ కన్స్ట్రక్షన్స్), అధ్యాపకులు ప్రసన్న, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

**ఏప్రిల్, మే నెలల్లో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు**

**వచ్చే మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డులో ఇందిరమ్మ ఇళ్లు - శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్**



**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం ; పేదవాడి ఆత్మ గౌరవానికి చిహ్నంగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం ఒకసారి చేసే కార్యక్రమం కాదని, ప్రతి సంవత్సరం కొనసాగించే శాశ్వత ప్రక్రియగా ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మాయ మాటలు చెప్పదని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ఆచరణలో చూపిస్తుందన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో పట్టణ ప్రాంతాలల్లోని ప్రతీ వార్డులో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ప్రకటించారు. శాసన మండలిలో మంగళవారం నాడు హౌసింగ్ పై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే మొదటి విడతలో ఇళ్ల మంజూరు జరగగా, మిగిలిన మూడు విడతలను కూడా దశలవారీగా పూర్తిచేస్తాం.రాష్ట్రంలోని మారుమూల గిరిజన తండాలు, గూడాల్లో గతంలో ప్రారంభమై వివిధ స్థాయిలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుంది. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లకు ఫ్లెక్సిబిలిటీ ఇచ్చి, లబ్ధిదారులకు అనుకూలంగా మార్పులు చేపడతాం.లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి వివక్ష ఉండదు. కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అత్యంత పేదలకే ప్రాధాన్యం ఇస్తాన్నాం. ఎక్కడైనా లోపాలు ఉన్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటాం.ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నాటికి సుమారు లక్షఇళ్లు పూర్తి కానున్నాయి. జూన్-జులై నాటికి మొదటి విడతలో మంజూరైన మూడు లక్షల ఇళ్లలో మెజారిటీ పూర్తి అవుతాయి. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని, పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ప్రస్తుతం వాళ్ళు నివసిస్తున్న ప్రాంతానికి వీలైంత దగ్గరలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టడానికి కార్యాచరణ రుపొందిస్తున్నాం. గతంలో దూర ప్రాంతాల్లో నిర్మించిన 2 బి హచ్ కే ఇళ్లను లబ్ధిదారులు ఉపయోగించలేకపోయిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం. అదేవిధంగా, 2 బి హచ్ కే పథకంలో పెండింగ్ బిల్లులలో 99% ఇప్పటికే చెల్లించామని, మిగిలినవాటిని కూడా త్వరలో క్లియర్ చేస్తాం. వివిధ దశల్లో ఆగిపోయిన 2 బి హచ్ కే ఇళ్లను పూర్తి చేసి అర్హులైన పేదలకు అందజేయడానికి ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు.

# భవిత కోచింగ్ సెంటర్ చైర్మన్ షేర్ల సంతోష్‌కు ఘన సన్మానం

**ఇన్ఫ్రా డెవలప్మెంట్ కన్స్ట్రక్షన్స్ అక్బర్ పాషా ప్రశంసల వెల్లువ**








**వరంగల్ జిల్లా బ్యూరో మర్చి 18,మీడియా టుడే.**

నర్సంపేట పట్టణంలోని అంగడి సెంటర్లో ఉన్న భవిత నవోదయ కోచింగ్ సెంటర్లో నిర్వహించిన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. 2026 నవోదయ ప్రవేశ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు సీట్లు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో, కోచింగ్ సెంటర్ చైర్మన్ షేర్ల సంతోష్‌ను ముఖ్య అతిథి ఎండి అక్బర్ పాషా (భూషిత ఇన్ఫ్రా డెవలప్మెంట్ కన్స్ట్రక్షన్స్) ప్రత్యేకంగా సన్మానించారు.

**నవోదయ విజేతలకు ఘన సత్కారం**

**- ప్రశంస పత్రాలు, శాలువాలతో గౌరవం...**

ఈ సందర్భంగా నవోదయలో సీట్లు సాధించిన రితీష్, రామ్ తేజ్, తేజశ్రీ, లాస్య, జస్మిక, సంకీర్తన తదితర విద్యార్థులకు ప్రశంస పత్రాలు, శాలువాలు అందజేసి ఘనంగా సన్మానించారు. విద్యార్థుల కృషిని కొనియాడుతూ, వారి భవిష్యత్తు మరింత వెలుగొందాలని ఆశీర్వదించారు.

**-పేద కుటుంబం నుంచి ప్రారంభమైన ప్రస్థానం**

**విజయగాథగా భవిత**

ఈ సందర్భంగా మాట్లాడిన అక్బర్ పాషా, భవిత కోచింగ్ సెంటర్ చైర్మన్ షేర్ల సంతోష్ జీవిత ప్రయాణాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన, పేద విద్యార్థులు కూడా ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో భవిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారని తెలిపారు. తన కష్టంతో, పట్టుదలతో అనేక మంది విద్యార్థులకు భవిష్యత్తు నిర్మిస్తున్నారని ప్రశంసించారు.

**12 ఏళ్ల నిరంతర కృషి - వందలాది విద్యార్థులకు వెలుగు**

గత 12 సంవత్సరాలుగా అహర్నిశలు శ్రమిస్తూ విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్న షేర్ల సంతోష్ సేవలను అక్బర్ పాషా కొనియాడారు. ఇప్పటివరకు అనేక మంది విద్యార్థులు నవోదయలో సీట్లు సాధించడం ఆయన కృషికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

**గ్రామం నుంచి రాష్ట్రస్థాయికి - భవితకు పెరుగుతున్న ఖ్యాతి..**

మారుమూల గ్రామం నుంచి ప్రారంభమైన భవిత కోచింగ్ సెంటర్, ప్రస్తుతం జిల్లాల దాటి రాష్ట్రవ్యాప్తంగా పేరు గాంచిందని అక్బర్ పాషా పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సంస్థ మరింత అభివృద్ధి చెంది, వేలాది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రముఖుల సమక్షంలో విజయోత్సవం.**

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ షేర్ల సంజన, కాసుల రవికుమార్ (లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకులు), అధ్యాపకులు ప్రసన్న, వెంకటేష్, రాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.భవిత కోచింగ్ సెంటర్ సాధిస్తున్న విజయాలు విద్యారంగంలో ఒక ఆదర్శంగా నిలుస్తున్నాయి. షేర్ల సంతోష్ వంటి వ్యక్తులు సమాజానికి దిశానిర్దేశం చేస్తూ, పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఈ ప్రయాణం మరింత మంది విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

# హజ్ యాత్రికుల కోసం వైద్య పరీక్షలు

## - వరంగల్‌లో ఫిట్‌నెస్ శిబిరం నిర్వహణ



వరంగల్ జిల్లా బ్యూరో మార్చి18,మీడియా టుడే.

వరంగల్ జిల్లా కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు ఫిట్‌నెస్ శిబిరం నేడు వరంగల్‌లోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించబడింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో ఎంజీఎం ఆసుపత్రికి చెందిన నిపుణ వైద్యులు హజ్ యాత్రికులకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. యాత్రకు ముందు శారీరకంగా పూర్తిగా ఫిట్‌గా ఉండేలా అవసరమైన పరీక్షలు చేసి, ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు అందించారు. వరంగల్ జిల్లాలో మొత్తం 64 మంది హజ్ యాత్రికులు ఉన్నప్పటికీ, నేడు 57 మంది శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని వ్యాక్సినేషన్ కోసం సిద్ధమయ్యారు. మిగిలిన యాత్రికులు రేపు నిర్వహించే ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాష్ పర్యవేక్షణలో నిర్వహించబడిందని అధికారులు పేర్కొన్నారు. హజ్ యాత్ర సురక్షితంగా సాగేందుకు ముందస్తు వైద్య పరీక్షలు అత్యంత అవసరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సయ్యద్ షా గులాం అఫ్జల్ బిజ్బాని మాట్లాడుతూ యాత్రికుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. హజ్ సొసైటీ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సమన్వయంతో నిర్వహణకు సహకరించారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ ప్రకాష్, ఎంజీఎం స్పెషలిస్ట్ వైద్యులు, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఇక్బాజ్ అహ్మద్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, హజ్ సొసైటీ వరంగల్ అధ్యక్షులు జనాబ్ మహ్మద్ సర్వర్ మొహియుద్దీన్ ఘాజీ, అడ్వకేట్ షేక్ అబ్దుల్ ఖలీల్, రబ్బాని ఇస్లామియా కాలేజ్ పాత విద్యార్థుల సంఘం అధ్యక్షులు మహ్మద్ అఫ్జల్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖకు చెందిన వివిధ క్యాడర్ సిబ్బంది కూడా హాజరయ్యారు. హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ వైద్య శిబిరం ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది. ముందస్తు పరీక్షలు, వ్యాక్సినేషన్ ద్వారా యాత్రికులు సురక్షితంగా తమ యాత్రను కొనసాగించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తీసుకున్న ఈ చర్యలు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి.

# భాషా సామర్థ్యాల పెంపుకు ఇంగ్లీష్ ఫెయిర్‌లే వేదిక

## - డాక్టర్ అరుణ్

వరంగల్ జిల్లా బ్యూరో మర్చి 18,మీడియా టుడే.
వరంగల్ జిల్లా నర్సంపేట

విజ్ డమ్ పాఠశాల పిల్లల్లో భాషా సామర్థ్యాల అభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపు కోసం ఇంగ్లీష్ ఫెయిర్‌లాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ అరుణ్ పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం మార్కులకే పరిమితం కాకుండా, బాల్యదశ నుంచే పిల్లలకు భాషలపై పట్టు, ముఖ్యంగా అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీష్‌పై అవగాహన పెంపొందిం చడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. సరైన ఉచ్చారణ, సంభాషణ నైపుణ్యాలు చిన్నప్పటి నుంచే అభ్యాసం చేయడం ద్వారా పిల్లలు భవిష్యత్తులో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల అభివృద్ధిపై నిరంతరం దృష్టి పెట్టాలని, వారిలో నైతిక విలువలు పెంపొందించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. గురువులు, తల్లిదండ్రుల పట్ల గౌరవం కలిగి ఉండేలా పిల్లలను తీర్చిదిద్దితేనే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, లేకపోతే జీవితం దారితప్పే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జావేద్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపు కోసం తమ పాఠశాలలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సెంటర్ ఫర్ ఫారిన్ అండ్ ఇంగ్లీష్ లాంగ్వేజెస్ (సీఫెల్), హైదరాబాద్ సహకారంతో ప్రతిరోజూ ఒక ప్రత్యేక పీరియడ్ కేటాయించి విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామని, వారి ప్రతిభను వెలికితీసే దిశగా ప్రతి సంవత్సరం ఇంగ్లీష్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని వివరించారు .మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు పెంపొందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలో పాఠశాలలో సైకాలజిస్టుల పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, పిల్లల్లో వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఇంగ్లీష్ ఫెయిర్‌లో భాగంగా విద్యార్థులు వివిధ రాష్ట్రాలు, దేశాల వేషభాషలను ధరించి ఆకట్టుకున్నారు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్ట్,




హోటల్స్, రెస్టారెంట్లు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, సాఫ్ట్‌వేర్ మరియు ఫార్మా కంపెనీల్లో సంభాషణ ఎలా ఉండాలో ప్రదర్శించారు. అంతేకాకుండా పోటీ పరీక్షలకు అవసరమైన మానసిక స్థైర్యం పెంపుపై కూడా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు ఇంగ్లీష్‌లోనే పరస్పరం సంభాషిస్తూ తమ ప్రతిభను చక్కగా ప్రదర్శించడం విశేషంగా నిలిచింది .ఇంకా, పిల్లలు రూపొందించిన ప్లానిటోరియం నమూనాలు, నక్షత్ర గమనాలు, గెలాక్సీలు, పాలపుంతల వివరణలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అంతరిక్షం గురించి వారు చూపించిన అవగాహన, వివరణ శైలి అందరినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్, డైరెక్టర్ జావేద్, అకాడమిక్ ఇన్‌చార్జ్ నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీమ్ సుల్తానా, హారిక, వీరభద్రయ్య, సీఫెల్ ఇన్‌చార్జ్‌లు శ్రీజ, అమూల్య, స్పందన, ప్రణీత్, ప్రశాంత్ కుమార్, రాజేంద్రప్రసాద్, చెన్నస్వామి, అరుణ, గాయత్రి, దివ్యజ్యోతి, పృథ్వి, రాజేష్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తంగా, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో భాషా సామర్థ్యాలతో పాటు వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడుతున్నాయని, భవిష్యత్తులో వారు గ్లోబల్ స్థాయిలో నిలబడేలా మార్గం సుగమం చేస్తున్నాయని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

# గీతాంజలి పాఠశాలలో ఘనంగా అచ్చ తెలుగు ఉగాది వేడుకలు




వరంగల్ జిల్లా నర్సంపేట బ్యూరో మర్చి 18,మీడియా టుడే.

ఉగాది అంటే తెలుగువారి నూతన సంవత్సరాది. చైత్ర శుద్ధ పాడ్యమినాడు బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించిన రోజుగా భావించే ఈ పండుగకు ప్రత్యేకమైన స్థానం ఉంది. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి ద్వారా జీవితంలోని కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది. కొత్త ఆశలు, ఆకాంక్షలతో వసంత ఋతువును ఆహ్వానించే ఈ శుభదినాన్ని పురస్కరించుకొని గీతాంజలి పాఠశాలలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం సాంప్రదాయ వాతావరణంతో కళకళలాడింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. ఒకరికొకరు తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, మన తెలుగు సంస్కృతి, ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యతను చాటిచెప్పారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో తయారు చేసిన ఉగాది పచ్చడిని అందరూ ఆనందంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు గారు పాల్గొని మాట్లాడారు. నేటి కాలంలో అంతరించిపోతున్న మన సంప్రదాయాలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. మన పెద్దలు నిర్వహించిన ప్రతి పండుగలో ఆనందంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఉగాది పచ్చడి సేవించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి వేసవికాలంలో ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్ గారు మాట్లాడుతూ ఉగాది పండుగలో దాగి ఉన్న తాత్పర్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఉగాది పచ్చడిలోని తీపి, పులుపు, చేదు, వగరు, కారం, ఉప్పు రుచులు మన జీవితంలోని అనుభవాలను సూచిస్తాయని చెప్పారు. జీవితం లో వచ్చే అన్ని అనుభవాలను సమానంగా స్వీకరించే మనోభావం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు ఉగాది పండుగ ప్రాముఖ్యత, పంచాంగ విశేషాలు, రాశుల గమనాలు వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుతూ, రాబోయే తరాలకు వాటి విలువ తెలియజేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తం మీద గీతాంజలి పాఠశాలలో నిర్వహించిన ఈ ఉగాది వేడుకలు సంప్రదాయం, సంస్కృతి, ఆనందాన్ని కలగలిపిన అద్భుత సందర్భంగా నిలిచాయి.

# ఘనంగా “ఈద్ కానుకల” పంపిణీ

హైదరాబాద్ మీడియా టుడే న్యూస్ మార్చ్ 18:

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని శేరిలింగంపల్లి నియోజకవర్గం మజీద్ బండ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మైనారిటీ సోదరులకు అందించిన ఈద్ కానుకల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డివిజన్ ప్రెసిడెంట్ మొహమ్మద్ జహంగీర్ డివిజన్ సెక్రటరీ ఎండి. అజామ్, ఐవైసీ



డివిజన్ ప్రెసిడెంట్ కోడిచర్ల మహేందర్ , ఇమ్రాన్, రిషి రాయ్, లావణ్ కుమార్, నాగరాజ్ మరియు మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. తమ చేతుల మీదుగా స్థానిక ముస్లిం సోదరులకు ఈద్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లా డుతూ.. కులమతాలకు అతీతంగా పండుగలను అందరూ సంతోషంగా జరుపుకో వాలన్నదే ప్రభుత్వ ఆశయమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## నీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కుంభం

వలిగొండ మార్చి 18 మీడియా టుడే



మండల కేంద్రంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో వలిగొండ గ్రామం లోని 14వ వార్డులో, నూతన మంచి నీటి మోటారు పంపు మరియు 250 మీటరుల పైపు లైన్ ని పీట్టింగ్ చేయించి ప్రజలకు నిరంతరం నీటిని అధించే కార్యక్రమం నిర్వహించారుఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి, ఉపసర్పంచ్ మల్ల మాదవి వెంకటేష్ వార్డు సభ్యులు పల్లెర్ల లక్ష్మయ్య, ఎదురుగట్ల బాలు, మారగోని సురేష్ గౌడ్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## తడిచెత్త పొడిచెత్త వేరుచేయడంపై అవగాహన

రాయికల్-మీడియా టుడే-మార్చి 18:



రాయికల్ పట్టణంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం 9వ వార్డులో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, కమిషనర్ కీర్తి నాగరాజు, కౌన్సిలర్ బత్తిని మహేశ్వరిలు తడి చెత్త పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తవ్విన సిసి రోడ్లను పరిశీలించారు. డ్రైనేజీ పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు వంటి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తిని నాగరాజు, మచ్చ శేఖర్, బత్తిని భూమయ్య, రాజేష్, బొద్దుల శివ, వార్డు అధికారి సుష్మ, ఆర్పి శ్యామల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లుపేటలో నేటి నుంచి నల్ల పోచమ్మ దుర్గమ్మ జాతర మహోత్సవాలు

టేక్మాల్: మార్చ్ 18
మీడియా టుడే



టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామంలో ప్రతి ఏటా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే నల్ల పోచమ్మ దుర్గమ్మ గ్రామ దేవతల జాతర మహోత్సవాలను అనవయతిగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈరోజు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ దేవతామూర్తుల దేవాలయాల చుట్టూ డప్పు చప్పులతో చిందుల గురువారం నాడు విన్యాసాలతో బండ్లు తిరుగుతాయి. రెండవ రోజు ఉదయం బోనాలు 8.00గంటల నుండి 11:00వరకు మధ్యాహ్నం 12:00గంటలకు నుండి కుస్తీ పోటీలు జరుగుతుంది. కుల మతాలకు అతీతంగా అంగరంగ వైభవంగా మట్టి కుండలతో బోనాలు కుదించి నైవేద్యాన్ని అందులో పెట్టి గ్రామ పురవీధుల గుండా గ్రామదేవతలకు అనంతరం గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం కుస్తీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ మరియు పాలకవర్గం సభ్యులు తెలిపారు.

## రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోండి


### మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్

టేక్మాల్ మార్చ్ 18 (మీడియా టుడే)



భూభారతి ద్వారా 2026 ఫిబ్రవరి 28 వరకు రిజిస్ట్రేషన్ అయిన రైతులు కొత్తగా రైతు భరోసా కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిందం రాంప్రసాద్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రాముల రైతులు దరఖాస్తు చేసుకోవడానికి రైతు భరోసా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్, బ్యాంకు పుస్తకము, ఆధార్ కార్డు జిరాక్స్ జతచేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలన్నారు. అదేవిధంగా ఎవరైనా రైతులు వారి యొక్క బ్యాంకు ఖాతాను మార్పు చేయదలచుకున్నవారు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదిం చాలన్నారు. గతంలో రైతు భరోసా పొందిన రైతు సోదరులు మరల దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేదని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనితెలిపారు.

## మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం చిన్న మస్జీద్ నందు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమం



మిర్యాలగూడ, మార్చి 18 (మీడియా టుడే):

మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ మాస సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం (మస్జీద్ ఏ ఆరాఫత్) చిన్న మస్జీద్ నందు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కౌన్సిలర్స్, ప్రభుత్వం అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ సోదరులకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కుల మతాలకు అతీతంగా అందరము సోదర భావంతో మెలుగుతూ మన ఐకమత్యాన్ని ఈ సమాజానికి ఒక సందేశంగా పంపాలని అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో ఏడుగురు మైనారిటీ కౌన్సిలర్స్ కి రాజకీయంగా అవకాశం కల్పించడం. అలాగే 40 లక్షల వ్యయంతో బంగారు గడ్డలోని ఈద్గా నందు సీసీ మంజూరు చేయడం జరిగిందనీ అన్నారు. అదేవిధంగా ముస్లిం మైనారిటీ సోదరుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ ముస్లిం సోదరులకు అందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు.



# రెమ్యునరేషన్ లేకుండా సినిమా

సినిమా కళాత్మక వ్యాపారం. ఇక్కడ తారలు తమ ఇమేజ్‌ను బట్టి పారితోషికాల్ని డిమాండ్ చేస్తుంటారు. ఇక అగ్ర తారలైతే రెమ్యునరేషన్ విషయంలో ఏమాత్రం రాజీపడరు. కానీ ఈ ధోరణికి భిన్నంగా అగ్ర కథానాయిక తమన్నా 'ఓ రోమియో' అనే హిందీ సినిమాలో అతిథి పాత్రలో నటించినందుకుగాను ఎలాంటి పారితోషికాన్ని తీసుకోలేదట. ప్రస్తుతం ఈ విషయం బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. షాహిద్‌కపూర్, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రచార కార్యక్రమాల సందర్భంగా దర్శకుడు విశాల్ భరద్వాజ్ రెమ్యునరేషన్ల అంశం గురించి మాట్లాడారు. కథానాయిక తమన్నా, '12th ఫెయిల్' ఫేమ్ విక్రాంత్ మస్సే ఈ సినిమాలో అతిథి పాత్రల్లో నటించారని, తనతో ఉన్న స్నేహసంబంధాలతో పాటు ఓ మంచి కథకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో వారిద్దరూ పైసా పారితోషికాన్ని తీసుకోకుండానే నటించారని, ఈ రోజుల్లో అంతటి ఉదార స్వభావం ఉన్న వారు అరుదని ప్రశంసించారు. గెస్ట్‌రోల్ కోసం కొన్ని రోజులే కేటాయించినా.. ఇప్పుడున్న వ్యాపార దృక్కోణంలో ఉచితంగా నటించడం గొప్ప విషయమని బాలీవుడ్ వర్గాలంటున్నాయి. గత ఏడాది వచ్చిన 'ఓదెల-2' తర్వాత తెలుగులో తమన్నా మరే చిత్రానికి సైన్ చేయలేదు.

# తెలుగు నేర్చుకోవడం చాలా కష్టం



'సవాళ్లను స్వీకరించడమంటే నాకిష్టం. కష్టతరమైనది సాధించినప్పుడు కలిగే ఆనందానికి విలువ కట్టలేం' అంటున్నారు బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా. ప్రస్తుతం ఆమె మహేశ్‌బాబుకు జోడీగా రాజమౌళి 'వారణాసి' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రబృందం ఓ నేషనల్ ఛానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 'తెలుగుభాషతో మీ ప్రయాణం ఎలా ఉంది?' అని ప్రియాంకను ఆ ఇంటర్వ్యూలో వ్యాఖ్యాత అడగ్గా.. 'నాకు తెలుగు అస్సలు రాదు. నిజానికి తెలుగు భాష నేర్చుకోవడం చాలా కష్టం. మామూలుగా మాట్లాడటం ఒకెత్తయితే.. కెమెరా ముందు డైలాగ్ చెప్పడం మరో ఎత్తు. అందుకే ఈ విషయంలో రాజమౌళి హెల్ప్ తీసుకుంటున్నా. ఆయన నాకు డైలాగ్ అర్థం చెబుతారు. పాత్ర ఇన్‌టెన్షన్‌ని వివరిస్తారు. దాన్ని బట్టి ఓ పదినిమిషాలు దానిపై వర్క్ చేసి, అప్పుడు నా స్టైల్‌లో నేను డైలాగ్ చెప్తున్నా. నిజానికి అది అంత ఈజీ కాదు. అందరి సహకారం వల్లే అది సాధ్యమవుతోంది.' అంటూ సమాధానమిచ్చింది ప్రియాంక.

## పెళ్లి, విడాకులపై

# నిహారిక బ్లాస్ట్

టాలీవుడ్ నటి, కొణిదెల నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల తన వ్యక్తిగత జీవితం గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. పెళ్లి, విడాకులు, ఆ తర్వాత తన జీవితంలో జరిగిన మార్పుల గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో ఓపెన్‌గా మాట్లాడారు. నిఖిల్‌తో చేసిన ఒక పాత పాడ్ కాస్ట్‌లో తన విడాకుల గురించి చెబుతూ ఎమోషనల్ అవుతూ కనిపించారు నిహారిక.టాలీవుడ్ నటి, కొణిదెల నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల తన వ్యక్తిగత జీవితం గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. పెళ్లి, విడాకులు, ఆ తర్వాత తన జీవితంలో జరిగిన మార్పుల గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో ఓపెన్‌గా మాట్లాడారు. నిఖిల్‌తో చేసిన ఒక పాత పాడ్ కాస్ట్‌లో తన విడాకుల గురించి చెబుతూ ఎమోషనల్ అవుతూ కనిపించారు నిహారిక. ఖఽజవతీఅంవఎవత్ ఈ ఇంటర్వ్యూలో నిహారిక తన మనసులోని బాధ బయటపెట్టారు నిహారిక. మాది పెద్దలు కుదిర్చిన పెళ్లి. కొన్ని కారణాలతో మ్యారేజ్ తర్వాత విడాకులు తీసుకున్నాం. బయట వాళ్ళు దీనిపై ఎన్నో రకాలుగా మాట్లాడుకుంటారు. ఎంతో గ్రాండ్‌గా పెళ్లి చేసుకుని, డివోర్స్ తీసుకున్నారు అంటారు కానీ, నిజంగా ఆ నొప్పి ఎలాంటిదనేది అనుభవించిన వాళ్లకు మాత్రమే తెలుస్తుంది అని నిహారిక అన్నారు. పెళ్లి అనేది ప్రతి వ్యక్తి జీవితంలో ఒక ముఖ్యమైన నిర్ణయం అయినప్పటికీ, ప్రతి విషయం మనం ఊహించినట్లుగా జరగకపోవచ్చని నిహారిక అన్నారు. వివాహ బంధం ముగిసిన సమయంలో తాను చాలా కష్టాలు, సూటిపోటి మాటలు ఎదుర్కొన్నానని ఆమె చెప్పారు. నా క్యారెక్టర్ తప్పుబట్టారు, కుటుంబాన్ని దూషించారు.. పెళ్లి, విడాకులు అనేది నా జీవితంలో ఓ గుణపాఠం లాంటిది అని నిహారిక చెప్పారు. ఆ దశలో మానసికంగా బలంగా నిలబడటం సులభం కాదని, కానీ సమయం గడిచే కొద్దీ పరిస్థితులను అంగీకరించడం నేర్చుకున్నానని అన్నారు నిహారిక. అయితే పెళ్లి చేసుకునే ముందే ఒకరి గురించి ఇంకొకరు తెలుసుకోవడం చాలా అవసరమని చెప్పారు. అందరూ మన అమ్మానాన్నల్లా ప్రేమగా చూసుకోలేరుగా అని ఆమె చెప్పడం చూస్తుంటే.. నిహారిక విడాకులకు ఏదో బలమైన కారణమే ఉందని అర్థమవుతోంది.ఆ సమయంలో తనకు కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతు ఎంతో ఉందని నిహారిక పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు మనల్ని మరింత బలంగా మార్చుతాయని, ఆ అనుభవాలు తనలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని ఆమె చెప్పారు. ప్రస్తుతం తాను పూర్తిగా కెరీర్‌పై దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నానని తెలిపారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా కొత్త ప్రాజెక్ట్‌లపై పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ప్రేమ మరియు మద్దతు తనకు ఎప్పుడూ ప్రేరణగా ఉంటుందని ఆమె అన్నారు.

# మా అమ్మకు మళ్లీ పెళ్లి చేయాలనుంది..

## సుప్రీత ఎమోషనల్ కామెంట్స్ వైరల్



టాలీవుడ్ సీనియర్ నటి సురేఖా వాణి తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'బొమ్మరిల్లు' సినిమాతో ఆమెకు మంచి పేరు వచ్చింది. కొంతకాలంగా సినిమాలకు గ్యాప్ ఇచ్చిన సురేఖా వాణి ఇప్పుడు తెరపై తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఆమె కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 13న విడుదల కానుండగా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సుప్రీత తన తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో సుప్రీత మాట్లాడుతూ తన తల్లి సురేఖా వాణికి మళ్లీ పెళ్లి చేయాలనే ఆలోచన తనకు ఉందని వెల్లడించింది. "రీసెంట్‌గా ఈ విషయం అమ్మతో చెప్పాను. కానీ ఆమె మాత్రం నాన్న జ్ఞాపకాలతోనే జీవించాలనుకుంటోంది. ఆ ప్లేస్‌లోకి వేరే ఎవరినీ రానివ్వకూడదని భావిస్తోంది. అదే సమాధానం నాకు చెప్పింది" అని సుప్రీత తెలిపింది. అయితే తాను పెళ్లి చేసుకునేలోపు అయినా అమ్మకు మంచి జీవిత భాగస్వామి దొరికితే బాగుంటుందని కోరుకుంటున్నానని చెప్పింది. "మా అమ్మను బాగా చూసుకునే వ్యక్తి రావాలి. ఆమె చాలా హ్యాపీగా ఉండాలి. ఆమె కోరుకున్నది ఇవ్వాలి. ఆమె స్పేస్‌ను గౌరవించాలి" అంటూ భావోద్వేగంగా స్పందించింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులతో కూడా చర్చించామని, వారు కూడా ఓకే అన్నారని తెలిపింది. సురేఖా వాణి కెరీర్ గురించి కూడా సుప్రీత మాట్లాడింది. ఒకప్పుడు తన తల్లి ఎంతో బిజీ ఆర్టిస్ట్ అని, ఇప్పుడు మాత్రం అవకాశాలు తగ్గిపోయాయని పేర్కొంది. మేకప్ వేసుకుని ఏడాదిన్నర దాటిపోయింది. సినిమాల్లో నటించాలని అమ్మకు ఇంకా ఆసక్తి ఉంది. కానీ అవకాశాలు రావడం లేదు అని ఫీల్ అవుతోంది. కనీసం ఒక మంచి పాత్ర వచ్చినా చేయాలని ఉందని చెబుతోంది అని తెలిపింది. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇక సుప్రీత హీరోయిన్‌గా పరిచయం అవుతున్న 'అమరావతికి ఆహ్వానం' చిత్రం హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కింది. ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, శివకంఠనేని కీలక పాత్రల్లో నటించారు. జీవీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేఎస్ శంకర్రావు, ఆర్ వెంకటేశ్వరరావు నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో మిస్టరీ, క్షుద్రపూజలు, మూఢనమ్మకాల అంశాలతో కథ నడుస్తున్నట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాతో సుప్రీత ఎలా ఆకట్టుకుంటుందో చూడాలి.

Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103